ప్రజాశక్తి
గుంటూరు
సోమవారం
జనవరి - 1
2018
16 పేజీలు



సిమ్స్ కాలేజీలో విద్యార్థుల సందడి

రోడ్డు ప్రమాదాల్లో
నలుగురు మృతి
16 మందికి గాయాలు
3లో

షెడ్యూల్ ఏది....?
జన్మభూమిపై ప్రకటించని కార్పొరేషన్
2లో

ఆశలతో స్వాగతం

- అంబరాన్ని అంటిన సంబరాలు
- ఊరూవాడా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. గతేడాది జిల్లా ప్రజలకు కొన్ని చేదు జ్ఞాపకాలు, ఏదురైన కష్టాలను దిగమింగి పంటి బిగువుతో ఒపిక పట్టి ప్రభుత్వం ఎదో మేలు చేస్తుందన్న కోటి ఆశలతో నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. ఉన్నతాధికారులకు, రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖులకు ఆయా కార్యాలయాల ఉద్యోగులు, అధికారులు, కార్యకర్తలు వేడుకల్లో పాలుపంచుకుంటున్నారు. యువతీ యువకులు ఉత్సాహంగా సందడి చేశారు. రాత్రి 12 గంటలకు చర్చిలు, ఆలయాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 12 గంటలకు రాగానే బాణా సంచా కాలుస్తూ యువకులు రోడ్డుపై దూసుకువెళ్తూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొడ్తూ సందడి చేశారు. ప్రతి ఇల్లు, కార్యాలయాలు, బహుల అంతస్తుల సముదాయాల ముందు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు, తోరణాలు, పుష్పఅలంకరణలు, విద్యుత్ దీపాలతో సందడి చేశారు. పండ్లు, కాయలు, పూలు, బోకేలు, స్వీట్స్, శాలువాలు, కేకులు, ఐస్‌క్రీమ్‌తోపాటు, మద్యం 6లో

ప్రకృతిసేద్యనామ సంవత్సరంగా 2018


శిక్షణకు హాజరైన రైతులు, ఐటి నిపుణులు, మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

- సిఎం చంద్రబాబునాయుడు
- ప్రారంభమైన రైతు శిక్షణ
- 8 వేల మంది హాజరు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

రైతుల ఆత్మహత్యలు ఆగాలంటే జీరో బేస్డ్ విధానంలో ప్రకృతి వ్యవసాయం విధానం అనుసరించాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఆదివారం రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్ నేతృత్వంలో తొమ్మిదిరోజుల శిక్షణ ఆదివారం ప్రారంభమైంది. వ్యవసాయరంగ సలహాదారు కె.విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ 8 వేలమంది శిక్షణ తీసుకుంటున్నారని, వీరిలో 300 మంది ఐటి నిపుణులు ఉన్నారని చెప్పారు. గతంలో ఐటికి కేరాఫ్‌గా ఏపీ నిలిచిందని, భవిష్యత్తులో ప్రకృతి సేద్యానికి కేరాఫ్‌గా నిలుస్తుందని చెప్పారు. 2018 సంవత్సరాన్ని ప్రకృతి సేద్య నామసంవత్సరంగా ప్రకటిస్తున్నానని, ఈ ఏడాదంతా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఆరోగ్యంపై చేసే 20 శాతం ఖర్చును తగ్గించుకోగలుగుతామన్నారు. 2018లో రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లు, చంద్రన్న విలేజ్‌మాల్స్, షాపింగ్ మాల్స్, మార్కెటింగ్ యార్డుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని 6లో



తాడేపల్లిలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

మౌజన్ హత్యకు నిరసనలు

ప్రజాశక్తి - తాడేపల్లి

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బత్తిన నగర్ నల్లచెరువు వద్ద గల నూరాని మజీదులో మౌజన్‌ను హత్య చేయడాన్ని తాడేపల్లి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. సభ్య సమాజం తలదించుకునేలా మజీదులోకి అక్రమంగా చొరబడిన దుండగులు మౌజన్‌ను అత్యంత ఘోరంగా నరికి చంపడాన్ని మానవతావాదులు, ప్రజాస్వామిక వాదులు, ముస్లిములు తీవ్రంగా ఖండించాలని అసోసియేషన్ కోరింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మౌజన్‌ను హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం దోషులకు శిక్షపడేలా చర్య తీసుకోవాలని తాడేపల్లి మండల ముస్లిం వెల్ఫేర్ అ సోసియేషన్ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ ఎండి.గోరెబాబు, జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎండి.అక్బర్, తాడేపల్లి ముస్లిం మైనారిటీ అధ్యక్షులు నాగుల్‌మీరా, సభ్యులు కరీంబాబు, బడేబాబు, శీనుబాషా, సలీంబాషా, అహ్మద్, పేష్మామ్ ఎ.జలీల్ పాల్గొన్నారు.



బాపట్లలో ముస్లిముల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - బాపట్ల

మౌజన్ మహమ్మద్ ఫారుక్‌ను హత్యచేసి ఖురాన్‌ను దహనం చేసిన ఘటనకు నిరసనగా బాపట్ల అంజుమన్ ఎ ఇస్లామియా ఆధ్వర్యంలో ముస్లిములులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహశీల్దార్ వల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ర్యాలీలో అంజుమన్ కమిటి అధ్యక్షులు షేక్. జిలాని, మస్తాన్‌వలి, సలీం, ఫరీద్‌మస్తాన్, రఫి, రషీద్, కరిముల్లా, బాజి పాల్గొన్నారు.

అట్రాసిటీ తరహా చట్టం తేవాలి

ప్రజాశక్తి-కర్లపాలెం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ తరహా చట్టాన్ని ముస్లిముల కోసమూ తేవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు పి.అహ్మద్‌బాషా డిమాండ్ చేశారు. కర్లపాలెం ఐలాండ్ సెంటర్ నుంచి తాహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ నూనె ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.



బాపట్లలో తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిములు

షెడ్యూల్ ఏది..?

- జన్మభూమిపై ప్రకటించని కార్పొరేషన్
- ఆదివారం రాత్రి వరకు ఖరారు చేయని పార్టీ నేతలు
- ఫిర్యాదులు ఎక్కడ ఇవ్వాలో తెలియక తికమక పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

అయిదో విడత జన్మభూమి కార్యక్రమాలను జనవరి 2 నుంచి 11 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా చాలాచోట్ల మీకోసం కార్యక్రమాన్ని కూడా వాయిదా వేశారు. అర్జీలు ఇచ్చే వారు జన్మభూమి కార్యక్రమంలోనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోనశశిధర్ తెలిపారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఫిర్యాదులు ఎక్కడ ఇవ్వాలనే దానిపై నగర ప్రజలకు స్పష్టత లేకుండా పోయింది. దీనికి కారణం కార్పొరేషన్ అధికారులు నేటివరకు జన్మభూమి షెడ్యూల్‌ను విడుదల చేయకపోవటమే. మంగళవారం నుంచి ప్రారంభమయ్యే జన్మభూమి కార్యక్రమాలు కార్పొరేషన్ పరిధిలో ఏ వార్డులో ప్రారంభిస్తారో తెలియక నగర ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. షెడ్యూల్ తయారుచేసి ముందుగా నగర ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులపై ఉన్నప్పటికీ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంపై నగర వాసులు మండిపడుతున్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జన్మభూమిలో అన్ని ఫిర్యాదులు స్వీకరించాలని, పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కరించాలని, అందుకు తగిన విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఏడాది చివరి రోజు ఆదివారం కావటంతో కార్పొరేషన్ అధికారులు సోమవారం జన్మభూమి షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. కనీసం రెండు రోజుల ముందు షెడ్యూల్ విడుదల చేసినట్లయితే నగరవాసులకు తమ అర్జీలను ఏ వార్డులో ఎప్పుడు అధికారులకు అందించాలో నిర్ణయం తీసుకునేవారమని నగరవాసులు వాపోతున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు తాము ఎప్పుడు, ఎక్కడ జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటామనే విషయాన్ని ఆదివారం రాత్రి వరకు ఖరారు చేయకపోవటం వల్లే షెడ్యూల్ విడుదల చేయలేకపోయామని కార్పొరేషన్ సిబ్బంది చెబుతున్నారు.

ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కల్చరల్ నైట్





విద్యార్థుల నృత్య ప్రదర్శన, మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి - రేపల్లె

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పట్టణంలోని సిపిఎం కారాక్యలయం వద్ద శనివారం రాత్రి కల్చరల్‌నైట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్స్, నాటికలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను పోటీలను ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు సిహెచ్ మణిలాల్ ప్రారంభించగా రేపల్లె పట్టణ ఎస్ఐ రవీంద్రరెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేసే ఎస్ఎఫ్ఐ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలోని నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాలను అర్థం చేసుకోవాలని, చెడు అలవాట్లవైపు వెళ్లకుండా మంచిగా చదువుకోవాలని సూచించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎబిఆర్ డిగ్రీ కాలేజీ అధ్యాపకుల ప్రసాద్, ప్రేమచంద్, సురేష్ వ్యవహరిచారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బి.ఆర్య, నాయకులు ఎస్‌కె షరీఫ్, మహేష్, బాబూరావు, కె.ఆనంద్, ఎం.కిరణ్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.ప్రసాదు, కె.సాయిప్రసాదు పాల్గొన్నారు.

స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - తాడేపల్లి

యెదిద్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని డొలాస్‌నగర్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ప్రమాదాల నివారణకు స్కూల్‌జోన్ బోర్డులు ఏర్పాటు చేశారు. తరచు ఈ ప్రాంతంలో ప్రమాదాలు వాటిల్లుతూ అనేకమంది గాయాలపాలవుతున్నారు. డేంజర్‌జోన్‌గా ఈ ప్రాంతం ఉంది. ఈ పరిస్థితుల్లో యెదిద్య ఆర్గనైజేషన్ స్కూల్‌జోన్ బోర్డులు ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.స్టాలిన్, 9వ వార్డు కౌన్సిలర్ మాచర్ల అబ్బు, కార్యదర్శి బి.కుమార్, ప్రసాద్, బాబురావు, అజయ్ పాల్గొన్నారు.



బోర్డులు ఏర్పాటుచేస్తున్న యెదిద్య ఆర్గనైజేషన్ సభ్యులు

అభివృద్ధి సంవత్సరంగా 2018 : ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-పొన్నూరు

పొన్నూరు నియోజకవర్గ అభివృద్ధి సంవత్సరంగా 2018ని తాము భావిస్తున్నామని, ఈ ఏడాదిలో పూర్తి కావాల్సిన మిగిలిన పనులూ త్వరితగతిన పూర్తిచేస్తామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చెప్పారు. నియోజవర్గ రూపురేఖలు మార్చటానికే ఈ ఏడాదిని వినియోగించాలన్న కృతనిశ్చయంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఆదివారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందని చెప్పారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు లేకపోయినా, సమస్యలను అధికమించి ముందుకు వెళుతున్నామన్నారు. పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్న లక్ష్య దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్యా-వైద్య రంగాల్లో చేపట్టిన పనులు, ప్రతిపాదనలను వివరించారు. వీటిపై అధికారులతో సమీక్షించామని, 1,430 పనులు 102 కోట్లతో చేపట్టామని చెప్పారు. వీటిలో కొన్ని పూర్తికాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ప్రతిపక్షం అభివృద్ధిని అడ్డుకుంటూ అర్థంపర్థంలేని ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. విపక్షం ప్రజాపోరాటాలు చేయాలని, తామూ ప్రతిపక్షంలో ఉన్న కాలంలో చాలా ఉద్యమాలు చేపట్టామని వివరించారు. అయితే మూడున్నర ఏళ్లలో విపక్షం ప్రజా సమస్యలపై పోరాటం చేయలేదన్నారు. తప్పుడు విమర్శలు చేస్తున్నవారు సరిదిద్దుకోవాలని, నాయకులూ విచక్షణ కోల్పోతున్నారని ఆరోపించారు. చింతలపూడిలోని డివిసి కల్యాణమండపంపై వైసిపి చేసిన విమర్శలను ఖండించారు. 20 ఏళ్ల తర్వాత డివిసి కళల్యాణ మండపం ఇప్పుడు గుర్తు కొచ్చిందా? అని ప్రశ్నించారు. మీ పార్టీ సానుభూతిపరులు కూడా ఆ కల్యాణమండపంలో దినాలు, తద్దినాలు, పెళ్లిళ్లు చేసుకున్నారని గుర్తు చేశారు. సమావేశానికి ముందుగా నియోజకర్గ పరిధిలోని 22 మందికి దాదాపు రూ.15 లక్షల సిఎం సహాయనిధి చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, తదితరులు

రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి



దుర్గి వద్ద ప్రమాదంలో జీపు ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు, మృత దేహాలు(ఇన్‌సెట్)

ప్రతి గ్రామంలో నూతన సంవత్సరం వేడుకలకు అందరూ సిద్దపడుతూ ఉండగా కొన్ని కుటుంబాల్లో మాత్రం ఈ వేడుకలు విషాధాన్ని నింపింది. జిల్లాలో ఆదివారం వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందగా 16 మంది గాయపడ్డారు.

ప్రజాశక్తి - దుర్గి

రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అడిగొప్పల యర్రవాగు బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కారంపూడికి చెందిన సయ్యద్ మస్తాన్‌వలి (33) సొంత వాహనంలో కారంపూడి నుండి తొమ్మిది ప్రయాణీకులను ఎక్కించుకొని దుర్గి వైపు వస్తున్నాడు. దుర్గి నుండి కారంపూడి వస్తున్న లారీ అడిగొప్పల యర్రవాగు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న జీపును ఢీకొట్టింది. దీంతో జీపులో ఉన్న డ్రైవర్ మస్తాన్‌వలి, కాకిరాల గ్రామానికి చెందిన సిద్ధా మంగమ్మ, గుర్తు తెలియని మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన పొదిలి గురులక్ష్మి, పొదిలి సైదమ్మ, మాచర్లకు చెందిన కంకణాల పద్మ, అడిగొప్పల గ్రామానికి చెందిన ఆవుల పున్నయ్య తీవ్ర గాయాలు కాగా వేమవరం గ్రామానికి చెందిన పొదిలి మంగమ్మకు మాచర్లకు చెందిన కొప్పాకుల మల్లేశ్వరి, అడిగొప్పలకు చెందిన షేక్ నన్నేసాలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన వారిని గుంటూరుకు రిఫర్ చేశారు. మృతదేహాలను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచార మందుకున్న గురజాల డిఎస్‌పి ప్రసాద్, మాచర్ల రూరల్ సిఐ దిలీప్‌కుమార్, దుర్గి ఎస్‌ఐ బత్తిన సుబ్బానాయుడు, పలువురు ఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని బంధువులు గుర్తించేందుకు మాచర్ల ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచారు.

నాదెండ్ల : రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని సాతులూరు కరెంట్ ఆఫీస్ సమీపంలో చోటుచేసుకుంది. నాదెండ్ల ఎసై కె.చంద్రశేఖర్ వివరాల ప్రకారం ఫిరంగిపురం మండలం, మేరికపూడి గ్రామానికి చెందిన చేవూరి మస్తాన్‌రెడ్డి (40) వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తుంటాడు. పొలం మందుల నిమిత్తం కొలుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వైపు వెళ్తుండగా గుంటూరు నుండి నరసరావుపేట వెళ్తున్న గుర్తు తెలియని కారు వెనుక నుండి ఢీ కొనటంతో మస్తాన్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారంతో 108 సిబ్బంది వచ్చి మస్తాన్‌రెడ్డిని పరిశీలించి మృతి చెందాడని నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు పరారీలో ఉంది. నాదెండ్ల ఎసై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కలరు.

సత్తెనపల్లి రూరల్ : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని గుడిపూడి సమీపంలో చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ప్రకాశం జిల్లా పంగులూరు మండలం, చందలూరుకు చెందిన యనమల వెంకటరత్నం,బోదవాడకు చెందిన గుంజి ఆదిశేషమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. వెంకటరత్నం భర్తతోపాటు మరో మహిళతో కలసి చందలూరు నుండి ద్విచక్రవాహనంపై పెదకూరపాడు మండలం రామాపురం వద్దనున్న దేవస్థానంలో మొక్కు తీర్చుకుని తిరిగి వస్తుండగా ఈప్రమాదం చోటుచేసుకుంది. వెంకటరత్నం, ఆదిశేష మ్మలకు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనం ద్వారా సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పత్తి కూలీల ఆటో బోల్తా - పలువురుకి గాయాలు

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణ, జానపాడు గ్రామానికి చెందిన 12 మంది పత్తి కూలీలు మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో పత్తి తీసేందుకు కూలీ పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కి 12 మంది కూలీలు పిడుగురాళ్ల వైపు వస్తుండగా మోర్జంపాడు శివారు కెజిబివి పాఠశాల వద్ద రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఆటోలో ప్రయాణిస్తున్న నాగేంద్రం, శివమ్మ, చంద్రమ్మ, శ్రీలక్ష్మి, లక్ష్మి, రమాదేవి, ఆటో డ్రైవర్ సైదావరావుకు గాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు వారిని పిడుగురాళ్లలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. ఆటో వేగంగా వెళ్లడం వల్లే అదుపు తప్పిందని స్థానికులు చెబుతున్నారు.



పిడుగురాళ్లలో గాయపడిన కూలీలు

ప్రాణం తీసిన సెల్ఫీ

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణానికి సమీపంలో ఉన్న నాగార్జున సాగర్ కుడి కాలువ వద్దకు స్నేహితులతో కలిసి సరదాగా వెళ్లిన ఇంజినీరింగ్ విద్యార్థి ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యాడు. పట్టణానికి చెందిన గుంటక యశ్వంత్ రెడ్డి (19) స్థానిక న్యూటాన్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో బిటెక్ మొదటి సంవత్సరం చెందుతున్నాడు. స్నేహితులతో కలిసి పట్టణానికి సమీపంలో ఉన్న నాగార్జున సాగర్ కుడి కాలువ బొంబాయి కంపెనీ బ్రిడ్జి వద్దకు వెళ్లారు. బ్రిడ్జి గట్టుపై నిలబడి ఫొటోలు దిగుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో కిందపడినట్లు స్థానికులు తెలిపారు. ప్రవాహ ఉధృతి అధికంగా ఉండటంతో గల్లంతయ్యాడు. యశ్వంత్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి చక్రధర ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు యశ్వంత్ రెడ్డి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అమరావతి మేజర్‌లో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మండలంలోని లక్ష్మీపురం సమీపంలోని అమరావతి మేజర్‌కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం బయటపడింది. పొలాల్లో ఉన్న రైతులు కాలువలో మృతదేహం ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలులేకుండా ఉంది. నాలుగు రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్యచేసి కాలువలో పడవేశారా అనే విషయం పోలీసుల దర్యాప్తు తేలాల్సి ఉంది. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతునికి సుమారు 40 సంవత్సరాల వరకు ఉంటాయని రూరల్ ఎస్సై ఎస్‌కె నజీర్‌బేగ్ తెలిపారు.

బస్సులోనే కుప్పకూలిన ప్రయాణికుడు

ప్రజాశక్తి-రాజుపాలెం



గుండెపోటుతో ప్రయాణీకుడు మృతి చెందిన ఘటన రాజుపాలెం మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన ఎస్‌కె సిరాజ్(82) పిడుగురాళ్ల నుంచి సత్తెనపల్లికి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై బస్సులోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆర్టీసీ యాజమాన్యం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం ఖననం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని రేవేంద్రపాడులో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం పోలీసులు పంచాయతీ సిబ్బందిచేత ఖననం చేయించారు. సుమారు 40 సంవత్సరాలు పైబడి తెల్లచొక్కా గళ్ళ లుంగీ కలిగి ఉన్న యాచకుడు అయి ఉండవచ్చునని భావిస్తున్నారు. తెనాలి, రేవేంద్రపాడు రహదారి పక్కన చెట్టుకింద అతని మృతదేహాన్ని స్థానికులు కనుగొని రెవెన్యూ అధికారులకు తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తి పరిస్థితిని బట్టి తీవ్ర అనారోగ్యానికిగురై ఉండవచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.



గుర్తు తెలియని మృతదేహం

గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు



న్యూఢిల్లీకి	సమయం	వారం
ఎయిరిండియా	09.05	ప్రతిరోజూ
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
ఎయిరిండియా	20.40	ప్రతిరోజూ
హైదరాబాద్‌కు		
స్పైస్‌జెట్	09.35	ప్రతిరోజూ
ఎయిరిండియా	13.20	బుధవారం మాత్రమే
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా
ఎయిరిండియా	17.20	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	17.35	ప్రతిరోజూ
ట్రూజెట్	21.55	ప్రతిరోజూ
బెంగళూరుకు		
స్పైస్‌జెట్	07.55	మంగళవారం మినహా
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు
చెన్నైకు		
ట్రూజెట్	07.55	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	16.10	ప్రతిరోజూ
స్పైస్‌జెట్	14.00	మంగళవారం మాత్రమే
స్పైస్‌జెట్	20.00	ప్రతిరోజు(వయా బెంగుళూరు)
తిరుపతికి		
ఎయిరిండియా	07.55	బుధవారం మినహా
విశాఖపట్నానికి		
ఎయిరిండియా	10.55	బుధవారం మినహా
ఎయిరిండియా	15.35	బుధవారం మాత్రమే
వారణాసి(కాశీ)కి		
స్పైస్‌జెట్	14.40	మంగళవారం మినహా



ఆర్టీసీ రిజర్వేషన్ సమాచారం

గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుండి సోమవారం బయలుదేరే దూరప్రాంత బస్ సర్వీసులు, సీట్ల వివరాలను ఆర్టీసీ ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఫోన్ నెం.08632221573లో సంప్రదించాలని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరే బెంగళూరు సూపర్‌లగ్జరి 0, రాత్రి 9.45 గంటల ఇంద్ర ఎసి 6, రాత్రి 10.15 గంటల ఇంద్ర ఎసి 5, రాత్రి 11 గంటల కెపిహెచ్‌బి గరుడ ఎసి 9, రాత్రి 10.50 అమరావతి ఎసి 7, 11.15 గంటలకు కెపిహెచ్‌బి ఎసి 0, రాత్రి 8.30 గంటల చెన్నై సూపర్ లగ్జరీలో 1, విశాఖ సూపర్ లగ్జరీ రాత్రి 8 గంటలకు ఖాళీలు 24, రాత్రి 9.30 గంటలకు 25, తిరుపతి సూపర్ లగ్జరీ 6.45 గంటలకు 34 ఖాళీలు, 9.45 గంటలకు 23, 10.15 గంటలకు 23 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంక్వయిరీ నెం. 9959061597.

జిజిహెచ్ సమాచారం



గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో సోమవారం అందించే ఒపి, ఐపి వైద్య సేవలు, వైద్యుల వివరాలు..

జనరల్ మెడిసిన్ : మొదటి యూనిట్ డాక్టర్ పి.మోహన్‌రావు
శస్త్రచికిత్సలు: డాక్టర్ జి.సుబ్బారావు
గైనకాలజీ: డాక్టర్ పి.చంద్రశేఖరరావు
ఆర్థోపెడిక్ : డాక్టర్ జి.వరప్రసాద్
కార్డియాలజీ (సూపర్ స్పెషాలిటీ): డాక్టర్ ఎం.శ్రీనివాసరావు
రేడియోథెరపీ: డాక్టర్ డిఎస్ రాజునాయుడు
గాస్ట్రోఎంటరాలజీ: డాక్టర్ ఎ కవిత
యూరాలజీ: డాక్టర్ బి.ప్రకాశరావు
ప్లాస్టిక్ సర్జరీ: డాక్టర్ ఎం.మార్కండేయులు
చర్మ వ్యాధులు: డాక్టర్ ఎస్.నాగేశ్వరమ్మ
మానసిక విభాగం: డాక్టర్ ఎన్.మురళీకృష్ణ
చెవి, ముక్కు, గొంతు వ్యాధులు: డాక్టర్ డాక్టర్ ఎన్.శాంతయ్య
ఆప్తమాలజీ: డాక్టర్ ఫర్నికుమార్
చిన్నపిల్లల విభాగం: డాక్టర్ ఎంఎస్ రాజు
యోగా నేచురోపతి: డాక్టర్ ఉమాసుందరి
జిజిహెచ్ ఫోన్ నెం: 0863-2220035
సూపరింటెండెంట్: డాక్టర్ డిఎస్ రాజునాయుడు - 9849903089
డిసిఎస్ఆర్ఎంఒ: డాక్టర్ కె.ఆదినారాయణ, సిఎస్ఎ **ఆర్ఎంఒ:** డాక్టర్ వైరమేష్
నర్సింగ్ సూపరింటెండెంట్ : పుష్పావతి
ఒపి సమయం: ఉదయం 8 గంటల నుండి 11.30 గంటల వరకు

ఉచితంగా గుండె ఆపరేషన్లు అవసరమైనవారికి డాక్టర్ పొదిల ప్రసాద్ మిలీనియం బ్లాక్‌లోని రెండో ఫ్లోర్‌లో ప్రతిరోజూ వైద్యపరీక్షలు చేస్తారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి – బాపట్ల

పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం 2018 నూతన సంవత్సర క్యాలెండర్, డైరి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతనపాటి కోటేశ్వరరావు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యాక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసు, ఎం.సురేష్, జిల్లా కార్యదర్శి జె. వినయ్‌కుమార్, రవిబాబు, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌బాబు, సంజయ్, డేవిడ్, పాలేరు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రత్నబాబు పాల్గొన్నారు.

జన్మభూమి షెడ్యూల్

ప్రజాశక్తి – అమర్తలూరు

మండలంలో నిర్వహించే జన్మభూమి షెడ్యూల్ వివరాలను ఎంపిడిఒ పి.శ్రీనివాసులు వెల్లడించారు. 2వ తేది కూచిపూడి, 3న మూల్పూరు, యడవూరు, 4న పెదపూడి, కోరుతాడిపర్రు, 5న తురుమెళ్ల, మోపర్రు, 6న బోడపాడు, ప్యాపర్రు, 7న వామనగుంటపాలెం, 8న పాంచాళవరం, యలవర్రు, 9న ఇంటూరు, 10వ తేదిన అమర్తలూరులో సభలు ఉంటాయని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కోన రఘుపతి

పేరలిలో వైసిపి రచ్చబండ

ప్రజాశక్తి–కర్లపాలెం: మండలంలోని పేరళి గ్రామంలో వైసిపి ఎంఎల్ఎ కోన రఘుపతి పల్లెనిద్రలో భాగంగా మన 'ఎంఎల్ఎ–మన ఇంటికి' కార్యక్రమంలో భాగంగా రచ్చబండని పేరలి జడ్‌పి హైస్కూల్‌లో రెండో రోజు నిర్వహించి ప్రజల సమస్యలను అర్జీలు ద్వారా స్వీకరించారు. అనంతరం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రత్యేకంగా తయారు చేసిన తినుబండారాల దుకాణం

తినుబండారాలకు గిరాకీ

ప్రజాశక్తి–భట్టిప్రోలు

2018 నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే ఆయా గ్రామాల్లో స్వీటు షాపులను ఏర్పాటు చేశారు.పండ్ల వ్యాపారులూ ఈ సందర్భంగా తమ వ్యాపారాన్ని విస్తరింపచేశారు. రాత్రి వేడుకలకు యువకులు, ఉద్యోగులు, ఆయా వర్గాల ప్రజలు భారీ ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇదిలా ఉండగా మద్యం సేవించి వాహనం నడుపరాదని, అట్టి వారిపై డ్రంక్–డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ బాలనాగిరెడ్డి పలు గ్రామాల్లా మైక్ ప్రచారం నిర్వహించారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలేవి?

ప్రజాశక్తి – బాపట్ల

గంగిగోవు పాలు గరిటడైనను చాలు .... కడివెడైననేమి ఖరము పాలు .... ఇది ఆనాటి సూక్తి. అదినేడు తారు మారువుతోంది. ఖరము (గాడిద) పాలు, మాంసానికి గిరాకి పెరిగింది. గురువారం వచ్చిందనంటే పట్టణాల్లోని పలు వీధులు, గ్రామాల్లో గాడిదమాంసం విక్రయాలు జోరుగా ఉంటున్నాయి. ప్రధాన రహదారుల వెంట కిలోమీటరుకు ఒక గాడిద మాంసం దుకాణం వెలుస్తోంది. గాడిదమాంసాన్ని కి.లో రూ. 350 విక్రయిస్తున్నారు. గురువారం వచ్చిందంటే బాపట్ల కర్లపాలెం, ప్రాంతాల్లో 8 కి.మీటర్ల దూరంలో 8 ప్రదేశాల్లో గాడిద మాంసాన్ని విక్రయిస్తున్నారు. పట్టణంలో జమ్ములపాలెం రోడ్డు సూర్యలంక రోడ్డు, మద్దిబోయినవారిపాలెం రోడ్డు, చీరాల రోడ్డులో గాడిద మాంసం దుకాణాలు కనిపిస్తాయి. మాంసాహార వినియోగం పెరిగిన పిదప వినియోగదారుడు దొరికిన కాడికి మాసాన్ని కొంటున్నాడే కానీ, అది ఆరోగ్యకరమైన జీవం నుంచి వచ్చినదా? కాదా? అని కాస్త ఆలోచించడం లేదు. దానికనుగుణంగానే మాసం విక్రయ దుకాణాలను తనిఖీలు చేసి, మాసం ఆరోగ్యకరమైనదే, సురక్షితమైనదే అని ధ్రువీకరించాల్సిన సంబంధిత అధికారులు లేకపోవడం, ఉన్నా ఆ అధికారి తన విధులను సక్రమంగా నిర్వహించక పోవడంవలనే అనారోగ్య మాంసం తిని ఆరోగ్య సమస్యలను కొనితెచ్చు కోవల్సివస్తుందని పలువురు చెబుతున్నారు. గాడిద మాంసాన్ని తీసుకోవడం ద్వారా శారీరకంగా కొన్ని రుగ్మతలు నివారించబడతాయనే కారణం చేత గాడిద మాంసాన్ని తినే వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఈ కారణంగానే ఆ మాంసానికి గిరాకీ ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల లో ఆరోగ్యకరమైన మాసం తీసుకునే హక్కు ప్రతి ఒక్క వినియోగదారునికి ఉంది.



బాపట్ల కర్లపాలెం మార్గంలో గాడిద మాంసం విక్రయిస్తున్న దృశ్యం

గ్రామపంచాతీల్లో ఈ గాడిద మాంసాన్ని తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. పట్టణంలో తనిఖీ అధికారే లేడు, మాంసానికి వినియోగించే గాడిదను ఆరోగ్యంగా ఉన్నాయా లేదు పరీక్షించే వైద్యాధికారి లేడు. కర్నాటక రాష్ట్రంనుండి పెద్ద సంఖ్యలో లారీల ద్వారా గాడిదల్ని కొనుగోలుచేసి ఇక్కడకి తెస్తారు. గాడిదల వ్యాపారం లక్షల్లో జరుగుతొంది. అయితే మాంసానికి వినియోగించే గాడిదల ఆరోగ్య పరీక్షలు మాత్రం జరగటంలేదు. కర్నాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మేలుజాతి గాడిదెలను పెంపకానికి ఉంచుకొని వయిస్సుమళ్ళిన, పెడబోయిన, బక్కచిక్కిన, ఆరోగ్యంగాలేని గాడిదల్ని గాడిదెల పెంపకం దారులు అమ్మేస్తున్నారు. ఆరకం గాడిదలను తక్కువధరకు కొనుగోలుచేసుకొని లారీల ద్వారా తీసుకొని ఇక్కడ మాంసానికి వినియోగిస్తున్నారు. వాటిఆరోగ్యం బాగుంటే సరి, లేదంలో వాటిమాంసాన్ని తిన్నవారు రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. పల్లెలతో పాటు పట్టణాల్లో మాంసానికి వినియోగించే గొర్రెలు, మేకలు,పొటేళ్ళు, గాడిదెలు, దున్నలు, పందులు, కోళ్ళు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు మున్సిపాల్టీలో తప్పనిసరిగా పశు వైద్యాధికారి లేదా ఆహార తనిఖీ అధికారి తప్పనిసరిగా ఉంటారు. అయితే బాపట్ల పట్టణంలో మాత్రం ఆహార తనిఖీ అధికారి లేకపోవడంతో మాంసం విక్రేతలు ఏ రకమైన మాంసాన్ని అమ్ముతున్నారోన్న సందేహం వినియోగదారుల్లో నెలకొంటుంది. దీంతో చనిపోవటానికి సిద్దమైనవి రోగపీడిత కాళ్ళు,రెక్కలు విరిగి,చనిపోయి వాటిమాంసాన్ని సైతం విక్రయిస్తు న్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఆరోగ్యంగా ఉన్న జంతువుల మాంసాన్నే విక్రయించాలి

బి. పార్థసారథి, ఎస్ఎన్‌పి అగ్రహారం బాపట్ల



మాంసాహారుల సంఖ్య పెరిగింది. పట్టణాల్లో మాంసం దుకాణాల్లో విక్రయించే మాంసాన్ని వైద్యాధికారులు తనిఖీ చేస్తారు. ప్రస్తుతం ఆ తనిఖీ విధానం లేదు. ఈ మధ్యకాలంలో గాడిదమాంసం విక్రయం పెరిగింది. మాంసం కోసం ఉపయోగించే గాడిదలు ఆరోగ్యకరమైనవేనా? అని పరీక్షలు నిర్వహించే వారే లేరు. అనారోగ్యంగా ఉన్న జంతువులు, పక్షుల మాంసం అక్కడక్కడా అమ్ముతున్నారు. దీంతో ప్రజలు రోగాల భారినపడే అవకాశాలున్నాయి. మాంసం కోసం ఉపయోగించే జంతువుల ఆరోగ్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్యంగా ఉన్న జంతువులమాంసాన్ని విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రత్యేకంగా మాంసపు తనిఖీ చేసే అధికారి లేరు



పట్టణంలో మాంసంకోసం వినియోగించే జంతువుల అరోగ్యపరీక్ష నిర్వహించే తనిఖీ అధికారి ప్రత్యేకంగా ఎవరు లేరు. తనిఖీ అధికారిని నియమించేందుకు చర్యలు తీసుకుంటాం.

కమిషనర్ వెంకటక్రిష్ణయ్య

కంప వేస్తే ఎలా బతకాలి సార్...

గాడిదల పెంపకందారుల ఆవేదన



మార్కెట్‌లోకి వెళ్లే దారిని కంపతో మూసివేసిన అధికారులు, చూపుతున్న పెంపకందార్లు

ప్రజాశక్తి – తాడేపల్లి

ఎన్నో ఏళ్ళ నుండి తాడేపల్లి మార్కెట్‌లో గాడిద మాంసం వ్యాపారం చేస్తున్న పెంపకందారులను మార్కెట్‌లోకి వెళ్ళేందుకు వీలు లేకుండా మున్సిపల్ అధికారులు ఆదివారం కంచె ఏర్పాటు చేశారు. దీంతో పెంపకందారులు తీవ్ర ఆందోళనతోపాటు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి మార్కెట్‌లో మొత్తం మాంసం విక్రయాలకు సంబంధించి ప్రస్తుతం 16 దుకాణాలు ఉన్నాయి. వీటిలో నాలుగు గాడిదమాంసం విక్రయానికే కటాయించారు. ఈ వ్యాపారం కూడా కేవలం వారంలో ఒక్క ఆదివారం మాత్రమే జరుగుతుంది. గాడిద మాంసం కోసం విజయవాడ నుంచి కూడా తాడేపల్లికి కొనుగోలుదారులు వస్తున్నారు. 1971లో రోడ్డుమీదే వ్యాపారం నిర్వహించేవారు. అనంతరం 1987లో సిపిఎం నాయకులు మేకా కోటిరెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో బకింగ్ హామ్ కాలువ ఒడ్డున స్థలం కేటాయించి అక్కడ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించారు. 2001లో సిపిఎం సర్పంచ్ ఉయ్యాల కోటేశ్వరరావు ప్రస్తుతమున్న మార్కెట్‌లో 8 షాపులు కేటాయించగా ప్రస్తుతం 4 షాపులు మాత్రమే నడుస్తున్నాయి. అవికూడా నడవడానికి వీల్లేదని మున్సిపల్ అధికారులు ఆదివారం మార్కెట్‌లోకి పెంపకందారులు వెళ్ళేందుకు వీల్లేకుండా కంచె వేశారు.

మాకు న్యాయం చేయండి : చిరంజీవి



కేవలం వారంలో ఒక్క ఆదివారం మాత్రమే తాము మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించుకుంటున్నాం. అందుకు మున్సిపాలిటీకి తగిన అద్దెకూడా చెల్లిస్తున్నాం. మార్కెట్‌లోకి వెళ్ళడానికి వీల్లేకుండా దారికి అడ్డంగా కంప వేయడం న్యాయం కాదు. మున్సిపల్ అధికారులే మాకు న్యాయం చేయాలి.

నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం భావ్యమా సుబ్బారావు



అధికారులు తమకు చట్టపరంగా షాపులు కేటాయించారు. షాపుల నుండి తమను తొలగించాలంటే ముందుగా అధికారులు నోటీసులు ఇవ్వాలి. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇలా చేయడం భావ్యమా. అధికార ప్రతిపక్ష, వామపక్ష రాజకీయ పార్టీలనాయకులను కలిసి సమస్యను వివరించాం. తమ జీవనం సాగేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

జన్మభూమితో ఒరిగేదేమీలేదు

ప్రజాశక్తి - మంగళగిరి

జన్మభూమి కార్యక్రమంతో ఒరిగేదేమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెవి.రాఘవులు అన్నారు. ఆదివారం సిపిఎం కార్యాలయంలో మంగళగిరి మండల రూరల్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి బి.జానారెడ్డి అధ్యక్షత వహించారు. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలైన జన్మభూమి కమిటీల పేరుతో టిడిపి కార్యకర్తలకు, నాయకులకు అందుతున్నాయని విమర్శించారు. సామాన్య ప్రజలకు ఏ సంక్షేమ పథకం అందడంలేదన్నారు. గతంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకొని నివాసముంటున్నవారికి రెగ్యులరైజేషన్ చేసి పట్టాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని విమర్శించారు. 3వ విడత రుణమాఫీకూడా సక్రమంగా చేయలేదని వివరించారు. సిపిఎం మండల కార్యదర్శి వై.గంగాధరరావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగసందర్భంగా ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు. జనవరి 6,7 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం మండల కమిటీ నాయకులు ఎం.పకీరయ్య, ఎం.భాగ్యరాజు, జి.కోటేశ్వరి, ఎ.ప్రకాశరావు, ఎల్.వెంకటేశ్వరరావు, డి.ప్రకాశరావు, వై.పిచ్చియ్య, ఉద్దంటి దుర్గారావు, పండల ప్రసాద్, ఎం.జ్యోతిబసు, వి.సాంబయ్య, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వై.గంగాధరరావు



డిజిపికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న గంజి

నూతన డిజిపిని కలిసి గంజి చిరంజీవి

ప్రజాశక్తి - మంగళగిరి

నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన మాలకొండయ్యను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఆకుల జయసత్య, టిడిపి నాయకులు పి.బాపనయ్య పాల్గొన్నారు.



మధుసూదనరావును సన్మానిస్తున్న ఫిక్కీ సభ్యులు

డిక్కి ఆధ్వర్యంలో మన్నెంకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక విటిజెఎం అండ్ ఐవిటిఆర్ డిగ్రీ కాలేజీలో ఆదివారం ఎంఎంఆర్ గ్రూపుల అధినేత డిక్కి రాష్ట్ర అధ్యక్షులు మన్నెం మధుసూదనరావును గుంటూరు జిల్లా డిక్కి కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా డిక్కి అధ్యక్షులు కె.ఆనందబాబు, కమిటీ సభ్యులు పి.ఎం.రాజు, జయరాజు, సిహెచ్.రామకృష్ణ, డి.గోవిందరాజు, ఈ.పెద్దబ్బాయ్ తదితరులు పాల్గొన్నారు.

25వ వార్డులో ఇంటింటికీ టిడిపి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని 25వ వార్డులో ఆదివారం ఇంటింటికీ టిడిపి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మునగపాటి వెంకటమారుతిరావు, కార్యదర్శి వెలగపాటి విలియం, టిడిపి నాయకులు రేఖా సుధాకర్, ఊట్ల శ్రీమన్నారాయణ, నందం అబద్దయ్య, షేక్ జిలాని, షేక్ హుస్సేన్, కె.రాజశేఖర్, వాకా మాధవరావు, మద్దిరాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో నూతన సంవత్సర హడావిడి


రోడ్ల వెంబడి కేక్ స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో ప్రజలు నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు ఆదివారం సిద్ధమయ్యారు. పలువురు వ్యాపారులు ఎక్కడా చూసినా రోడ్ల వెంట కేక్ స్టాల్స్‌ను విపరీతంగా ఏర్పాటుచేశారు. రోడ్లపై నడిచేవాహనాలతో దుమ్ముధూళితో స్వీట్లు కేకులు నిండిపోతున్నాయి. అయినా ప్రజలు వాటిని లెక్క చేయకుండా ఆనందోత్సాహాలతో వాటిని కొనుగోలుచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

నూతన సంవత్సర సంబరాలు గ్రామీణ ప్రాంతాల్లోసైతం ఎంతో ఆర్భాటంగా జరుగుతున్నాయి. మండల కేంద్రం దుగ్గిరాలలోని శివాలయం సెంటర్, రైలుపేటల్లో మిఠాయి దుకాణాలు, రకరకాల వెరైటీలతో చూపరులను నోరూరిస్తున్నాయి. రైలుపేట ముర్తుజానగర్ ప్రాంతాల్లో బిర్యాని పాయింట్లు వెలిశాయి. బాణాసంచా దుకాణాలు సైతం ప్రత్యేకంగా నెలకొల్పడం కనిపించింది. నూతన సంవత్సర వేడుకుల ఆదివారం రాత్రి యువకులు సంబరాలకు సిద్ధమవుతున్నారు.



దుగ్గిరాలలో స్వీట్లు కొనుగోలు చేస్తున్న స్థానికులు

బిసి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి - మంగళగిరి

నియోజకవర్గ బిసి సంక్షేమసంఘం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో మంగళగిరి మండల బిసి సంక్షేమసంఘం మహిళా అధ్యక్షురాలిగా పి.వెంకటేశ్వరమ్మ, పట్టణ బిసి సంక్షేమసంఘం ప్రచార కార్యదర్శిగా పి.నాగేశ్వరమ్మలను నియమించారు. ఈమేరకు నియోజకవర్గ సంక్షేమసంఘం కన్వీనర్ మంద్రు రాము నియామక పత్రాలను అందజేశారు. సమావేశంలో పి.రంగనాథ్, పి.విష్ణురాజు, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు ఎప్పుడో?

రాకపోకలకు ఇబ్బందులకు పడుతున్న ప్రజానీకం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరా నిమిత్తం సిసి రోడ్లను పగలకొట్టి పైపులైన్లు వేశారు. ఐదారు రోడ్లలో ఈ విధంగా పగులకొట్టి నెలల గడుస్తున్నా మున్సిపల్ అధికారులు మరమ్మతులు నిర్వహించడం లేదు. పైపులైను పగులకొట్టేటపుడు ఆ ఖర్చును కూడా సంబంధిత ట్యాపుల యజమానుల వద్ద నుండే మున్సిపల్ అధికారులు వసూలు చేశారని స్థానికులు తెలిపారు. నెలల తరబడి మరమ్మతులు చేయకపోవడం వల్ల రోడ్లపై రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు పేర్కొంటున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా దీనిపై చర్చ జరిగింది. పండుగ రోజులు కావడంతో వెంటనే ఈ పైపు లైన్లకు మరమ్మతులు చేయాలని కొంతమంది కౌన్సిలర్లు సమావేశంలో ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. అయితే వారం రోజుల్లో వేస్తామని అధికారులు సమాధానం చెప్పినప్పటికీ వేస్తారో వేయరోనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు పగిలిపోయి ఉండటంతో ఇళ్లల్లోకి వెళ్లాలన్న ఇబ్బందిగా ఉంటోందని వారు పేర్కొంటున్నారు. వెంటనే పైపులైన్లకోసం పగులకొట్టిన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని వారు కోరుతున్నారు.



పైపులైన్ల నిమిత్తం పగులకొట్టిన రోడ్డు

రేపటి నుంచి జన్మభూమి సభలు

తాడికొండ : ఐదో విడత జన్మభూమి - మాఊరు కార్యక్రమాలు జనవరి 2వ తేదీ నుండి 11వ తేదీవరకు గ్రామాల వారీగా నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ దొప్పలపూడి నరేంద్ర ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించిన గ్రామాలవారీగా షెడ్యూల్ విడుదల చేశారు. 2వ తేదీ కంతేరు, నిడుముక్కల, 3న లాం, 4న బేజాత్‌పురం, ముక్కామల, 5వ రావెల, పాములపాడు, 6న మోతడక, లచ్చన్న గడిపూడి,7న దామరపల్లి, 8న ఫణిదరం, 9న గరికపాడు, బండారుపల్లి, 10న పొన్నెకల్లు, 11న తాడికొండ గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు.

జన్మభూమి సభల్లో అందరూ పాల్గొనాలి

తాడేపల్లి : 2వ తేదీ నుంచి ప్రారంభంకానున్న జన్మభూమి గ్రామ సభల్లో తాడేపల్లి పట్టణంలోని టిడిపి పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు అందరూ పాల్గొనాలని పార్టీ పట్టణ అధ్యక్షులు జంగాల సాంబశివరావు చెప్పారు. ఆదివారం టిడిపి పట్టణ కమిటీ సమావేశం తాడేపల్లిలోని గంగోత్రి సాయి ఇంట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, పట్టణ ప్రజలకు నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలోపట్టణ ప్రధాన కార్యదర్శి జె.మరియదాసు, డి.రామారావు, తెలుగు యువత అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, ఎ.మురళి, కె.రమణ, బి.రామకృష్ణ, కె.యేసయ, ఎస్.కిరణ్, ఎం.పుల్లారెడ్డి, దానబోయిన సుందరరావు యాదవ్, కె.బాపిరెడ్డి, కౌన్సిలర్ ఇట్టా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ కమిటీ పాలకవర్గం సమావేశం

తాడేపల్లి: తాడేపల్లిలోని శ్రీ విశ్వేశ్వరస్వామి(వీరభద్రస్వామి) దేవస్థానం ఆలయ కమిటీ పాలకవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో పాత పూజారి తన విధుల నుండి విరమణ పొందిన సందర్భంగా కొత్తగా మరో వ్యక్తిని పూజారిగా నియమించాలని కోరారు. ఆలయ అభివృద్ధిపై తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. సమావేశంలో సభ్యులు వల్లభనేని వెంకటరావు, ఎం.గోపాలరావు, డి.రామారావు, బి.వెంకటరెడ్డి, విజయలక్ష్మీ, సురేష్‌కుమార్, ఆలయ ఈవో తమ్మా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థికసాయం అందజేత

మంగళగిరి : పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ నల్మా వివాహ నిమిత్తం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఆదివారం ఆయన కార్యాలయంలో రూ.10వేలు ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షులు సద్దాం హుస్సేన్, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని, మాజీ కౌన్సిలర్ షేక్ కదిర్‌బాషా, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మహబూబ్ సుబాని తదితరులు పాల్గొన్నారు. కాగా చిరంజీవి మాట్లాడుతూ మైనారిటీ ఆడపడుచులకు ప్రభుత్వం చేపట్టిన దుల్హన్ పథకం కింద రూ.50వేలు ఆర్థికసహాయాన్ని త్వరలో మంజూరుచేస్తామని తెలిపారు.

ఇంటిపన్నుల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి

దుగ్గిరాల : ఇంటిపన్నులు పెంచే విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని టిడిపి మండల కమిటీ ఆదివారం తీర్మానించింది. మండల టిడిపి అధ్యక్షులు గుడూరు వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొనే పార్టీ కార్యదర్శులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని అర్జీదారులకు సహాయపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్వతంత్రభారతి, ఎంఇఒ సుజాత, అంకె మారుతివరప్రసాద్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశలతో స్వాగతం

దుకాణాలు రాత్రి 12 గంటల వరకూ రద్దీగా కనిపించాయి. వ్యాపారులు ఆఫర్లు ప్రకటించారు. విద్యా సంస్థలు, హోటళ్లు, కార్యాలయాల్లో వేడుకలు ఆదివారం రాత్రి 10 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. చాలా కార్యాలయాల్లో ముందస్తుగానే కేకులు కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. హోటళ్లలు,విద్యా సంస్థల్లో యువత నృత్యాలు జోరుగా సాగాయి. రాత్రి 10 గంటల నుంచి పోలీసులు పెద్ద సంఖ్యలో రహదారులపై బందోబస్తు ఏర్పాటు చేసి యువతను నియంత్రించారు. నూతన సంవత్సరమైనా ఈ ఏడాది వస్త్రాల కొనుగోలు చాలా మందకొడిగానే జరిగిందని వ్యాపార వర్గాలు తెలిపాయి. గుంటూరు నగరంలోని అపార్టుమెంట్స్‌లో నివాసితులంతా కలసి మెలసి సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించుకున్నారు. వ్యాపారస్తులు,కార్యాలయాల ఎదుట నూతన సంవత్సరం వేడుకలకు అలంకరణ చేసి వినియోగదారులను ఆహ్వానించారు. బంగారం కొనుగోలు గతేడాదితో పోల్చితే నామమాత్రమే. కుటుంబంలో పిల్లలకు, రక్త సంబంధీకులకు కొత్త సంవత్సరం సందర్భంగా ప్రతి ఏటా ఏదో హామీలు ఇచ్చి కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా నెరవేరుస్తుంటారు. ఈ ఏడాది బంగారం దుకాణాలల్లో ఈ సందడి చాలా తక్కువగానే ఉంది. అలాగే వ్యవసాయ కార్మికులు, నిరుపేదలు, రోజువారీ కూలీ పనులు చేసుకునే వారు, వివిధ చేతి వృత్తులపై ఆధారపడిన వారు తమ పిల్లల ఆనందం కోసం వేడుకల్లో చాలా తక్కువగానే ఖర్చు పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ప్రకృతిసేద్యనామ సంవత్సరంగా 2018

చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతకు సిఎం ప్రాధాన్యం ఇస్తున్నారని, రానున్న ఐదేళ్లలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.700 కోట్లతో దాదాపు 12.50 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని అమలు చేస్తామని వివరించారు. ఇందుకు అజీమ్‌ప్రేమ్‌జీ సంస్థ రూ.100 కోట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల 90 శాతం నీరు, విద్యుత్ ఆదా అవుతాయని చెప్పారు. సరైన ధరలు లభించక, పంట చేతికి రాక, రుణబారంతో దేశంలో 7 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవటం విచారకరమన్నారు. జిల్లా కలెక్టరు కోనశశిధర్ మాట్లాడుతూ సేద్యపు ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరగాలన్నా, రైతుల ఆత్మహత్యలు ఆగాలన్నా జీరోబేస్డ్ ప్రకృతి వ్యవసాయం అవసరమన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం పాలేకర్‌ను సిఎం సత్కరించి, బుద్ధ విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, శాసన మండలి విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఏపీ ఆహార కమిషన్ జె.ఆర్.పుష్పరాజ్, జడ్పీ ఛైర్‌పర్సన్ షేక్ జానీమూన్, మాజి మంత్రి రావెల కిషోర్‌బాబు, ఇండియాలోని మారిషస్ హైకమీషనర్ జగదీష్ గోవర్ధన్, మేఘాలయ వ్యవసాయ శాఖ

ఘర్షణలో మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

పొలానికి నీళ్లు పెట్టుకునే విషయంలో ఘర్షణ జరిగి మహిళపై దాడి జరిగిన ఘటన మండలంలోని మంచికలపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. షెడ్డుతో నీళ్ళు పెట్టుకునే క్రమంలో ఏమినేని రవి, యార్లగడ్డ లక్ష్మీశ్రీనివాసులు ఘర్షణ పడుతుండగా రవి తల్లి ఏమినేని భానుమతి వారించబోయింది. యార్లగడ్డ లక్ష్మీశ్రీనివాసరావు కత్తి తీసుకొని కొట్టడంతో ఆమెచేతికి గాయమైంది. 108 వాహనంలో ఆమెను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.



తీగ లాగితే కదిలిన డొంక



ప్రజాశక్తి - బాపట్ల

వృద్ధురాలిని బెదిరించి ఆమె గొంతుకు గుడ్డలు కట్టి బలవంతంగా ఆమె వద్ద రూ.3 వేలు లాక్కోని వెళ్ళిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులకు దీనికి అనుసంధానంగా ఓ యువకుడు హత్యకు గురైన ఘటన వెలుగు చూసింది. ఆదివారం పట్టణ పోలీస్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాపట్ల డిఎస్పీ డి.గంగాధరం కేసు పూర్వాపరాలను వివరించారు. 2017 సెప్టెంబరు 13న పట్టణంలోని జమ్ములపాలెం రైల్వే బ్రిడ్జి కింద ఊర్వశి బార్ ఎదురు ఉన్న ఒక పూరింట్లో వృద్ధురాలిని బెదిరించి ఆమె వద్ద నగదును చలంచర్ల వెంకయ్య అను యువకుడు లాక్కేళ్ళారు. తెనాలిలోని కొత్త వంతెన కింద నారాయణ అనే వ్యక్తి వెంకయ్యకు పరిచయమయ్యామడు. వెంకయ్య తాగిన మైకంలో వృద్ధురాలి వద్ద డబ్బు లాక్కున్న విషయాన్ని నారాయణకు చెప్పాడు. ఇద్దరు కలసి బాపట్ల పట్టణంలో మరమ్మతుల దశలో ఉన్న విజయకృష్ణ థియేటర్లో స్వీపరుగా పనిచేస్తున్న (వెంకయ్య సోదరి) పోలమ్మ దగ్గరకి వచ్చారు. నాలుగు రోజుల పాటు ఇద్దరు కలసి కూలి పనులు చేసుకొని వచ్చిన డబ్బులతో మద్యం తాగారు. మైకంలో ఉన్న నారాయణ పట్టణంలోని శ్రీనివాస థియేటర్ పార్కింగ్ స్టాండ్‌లో పనిచేస్తున్న వెంకయ్య స్నేహితుడు కృష్ణతో వృద్ధురాలి వద్ద డబ్బు లాక్కున్న విషయాన్ని చెప్పాడు. అది విన్న వెంకయ్య తాగిన మైకంలో ఉన్న నారాయణను విజయకృష్ణ థియేటర్‌కు తీసుకువచ్చాడు.

దొంగతనం కేసుతో వెలుగు చూసిన హత్య

వృద్ధురాలి వద్ద డబ్బు కాజేసినట్లు ఎందుకు చెప్పావని 2017 అక్టోబరు 19న విజయకృష్ణ థియేటర్లో కర్రతో కొట్టి నారాయణను వెంకయ్య చంపివేశాడు. ఆ రెండో రోజు ఉదయం స్వీపర్ పోలమ్మ వచ్చి చనిపోయిన నారాయణ ప్రక్కన పడుకొని ఉన్న వెంకయ్యను, నారాయణను ఎందుకు చంపావని అడిగింది. నేను ముసలామె దగ్గర డబ్బు కాజేశానని అందరికి చెప్తున్నాడు. నేను చేసిన దొంగతనం ఎక్కడ బయటపడుతుందోనని కర్రతో కొట్టి చంపేశానన్నాడు. శ్రీనివాస థియేటర్‌లో స్వీపర్లుగా పనిచేస్తున్న తన అన్న, వదినను తీసుకువస్తానని చెప్పి వెళ్ళాడు. ఎంతసేపటికి రాకపోయేసరికి పోలమ్మ వెళ్ళి అన్న శ్రీనివాసు, వదిన మల్లిని తీసుకొచ్చింది. మృతి చెందిన నారాయణ మృతదేహాన్ని అక్కడే ఉన్న తోపుడు బండిపై పెట్టుకొని పాత బస్టాండు వైపునుండి ఉప్పర రైల్వే గేటు దగ్గర్లోని స్మశానంలో ముగ్గురు కలసి నారాయణ శవాన్ని పూడ్చి పెట్టారు.మూడు నెలలు గడిచాక నారాయణ హత్య కేసు తన మెడకు చుట్టుకుంటుందేమోనన్న భయంతో వి.ఆర్ ఓ ద్వారా పోలమ్మ పోలీసులకు జరిగిన సంఘటన వివరించింది. దీనితో 24గంటల్లోనే పోలీసులు చలంచర్ల వెంకయ్యను అదుపులోకి తీసుకున్నట్లు డిఎస్పీ వివరించారు. హత్యకు గురైన నారాయణను పూడ్చి పెట్టిన స్థలాన్ని గుర్తించారు. అసలు ఈ నారాయణ ఎవరనే అంశాన్ని తెలుసుకొనుటకు ఫోరెన్సిక్ నిపుణులతో తహశీల్దార్ సమక్షంలో జనవరి 2న శవాన్ని వెలికితీయనున్నట్లు డిఎస్పీ తెలిపారు. సమావేశంలో పట్టణ సి.ఐ. వినయ్ కుమార్, ఎస్సై. రవిశంకరెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై కుర్రకారు షికారు..

జోరుగా సాగిన మద్యం విక్రయాలు - రోడ్ల మీద వాహనాలు నిలిపి చిందులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

నూతన సంవత్సర వేడుకలను నగర యువత ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. రాత్రి 12 గంటలకు హ్యాపీ న్యూయర్ అంటూ ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆడపడుచులు ఇంటి ముందు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే ముగ్గులు వేసి, రంగులద్దారు. టీనేజ్ కుర్రా ళ్ల సంతోషాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ముఖ్య కూడ ళ్లలో కుర్రాళ్లు చేసిన హల్‌చల్ అంతా ఇంత కాదు. పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ, యువత మాత్రం అవేమి పట్టించుకోలేదు. సైలెన్సర్ తొలగించి మరీ వాహనాలను నడపటంతో నగర ప్రజలు భయంబ్రాంతులకు గురయ్యారు. ద్విచక్రవాహనాలపై ముగ్గురు నుంచి నలుగురు ఎక్కి అదేపనిగా హారన్ మోగించుకుంటూ రోడ్లమీద తిరిగారు. మద్యం తాగిన యువత ముఖ్య కూడళ్లలో ద్విచక్రవాహనాలను ఆపి చిందులేశారు. పోలీస్‌లు వాహనాలు గస్తీ తిరుగుతున్నప్పటికీ వీరిని అదుపులో పెట్టడం కష్టతరంగా మారింది. తెల్లవారుజామున మూడు గంటల దాకా రోడ్ల మీద కుర్రాళ్లు హల్‌చల్ చేస్తూనే ఉన్నారు. పోలీసులు ఎంతవారించినప్పటికీ మద్యం మత్తులో వినే స్థితిలో కుర్రాళ్లు లేరు. నూతన సంవత్సరం సందర్భంగా బార్‌లన్ని కిటకిటలాడాయి. ఇదే అదనుగా కొంతమంది వ్యాపారులు ఎంఆర్‌పి రేటు కన్నా ఎక్కువ రేటుకు విక్రయించి మంచి లాభాలను గడించారు. కొంతమంది నడిరోడ్డుమీద మద్యం తాగుతూ అటుగా వెళ్తున్నవారిన ఇబ్బంది పెట్టారు. అర్ధరాత్రి దాకా మద్యం షాపుల్లో విక్రయాలు జోరుగా సాగాయి.

సత్వర న్యాయం అందించేందుకే అదనపు కోర్టు

శంకుస్థాపనలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.హరిహరనాథశర్మ



మాట్లాడుతున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.హరిహరనాథశర్మ

ప్రజాశక్తి-మాచర్ల

కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకే మాచర్లలో మరో న్యాయస్థానం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.హరిహరనాథశర్మ అన్నారు. ఆదివారం స్థానిక న్యాయస్థానం ఆవరణలో అదనపు కోర్టు నిర్మాణానికి జిల్లా జడ్జిలతో పాటు కలిసి వచ్చిన హరిహరనాథశర్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాకే న్యాయం కోసం కక్షిదారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడని అతనికి సకాలంలో న్యాయం అందించకపోతే గెలిచినా ఉపయోగం ఉండదని అన్నారు. మాచర్ల న్యాయస్థానంలో పలు కారణాల వల్ల కేసులు సంఖ్య విపరీతంగా పెరిగిపోయాయని, 3వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు న్యాయస్థానం దృష్టికి ఈవిషయం తీసుకువెళ్లి కేసుల పరిష్కారం, సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఉన్నత న్యాయస్థానం మరోకోర్టును మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న న్యాయమూర్తులిద్దరూ ప్రణాళికబద్ధంగా పని చేస్తే కేసులు పరిష్కారం త్వరలోనే పరిష్కారమవుతుందని కక్షిదారులకు మేలు జరుగుతుందన్నారు. ఈసభకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు ఎ.లక్ష్మీ, గోపిచంద్, మంజరి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సులోచనారాణి, నూతన న్యాయస్థాన దేవన్ అజయ్‌కుమార్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, బార్ అసోసియేషన్ మెంబర్ బ్రహ్మారెడ్డి, సీనియర్ న్యాయవాదులు డేవిడ్‌రాజు, కెనడి, సత్యనారాయణరెడ్డి, రంగారావు, పట్టణ సిఐ సాంబశివరావు, ధిల్లీఫ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి



ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల్లో బిపిఈడి రెండో సంవత్సరం విద్యార్థి కె.అల్లారాయుడు ఆచార్య నాగార్జున విశ్వవి ద్యాలయ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ యుండు వెంకట్రావు ఆదివారం తెలిపారు. 29, 30 తేదీల్లో చిలకలూరిపేటలోని సిఆర్ కళాశాలలో నిర్వహించిన జరిగిన అంతర్ కళాశాల పోటీల్లో అల్లారాయుడు ప్రతిభ చూపి అంతర్‌విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ జట్టు ఫిబవరి మొదటి వారంలో పంజాబ్‌లోని ఎల్‌పియు వర్సిటీలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు జెయుఎస్‌హెచ్ ప్రసాద్, డి ప్రేమ్‌కుమార్, ఆర్.బలరామ్ నాయక్

పోలీసులకు క్రికెట్ పోటీలు



ఆటలో పాల్గొన్న పోలీసులు

ప్రజాశక్తి -నరసరావుపేట

నరసరావుపేట డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. నరసరావుపేట, వినుకొండ పోలీస్ జట్ల మధ్య క్రికెట్ ఆటలను డిఎస్‌పి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆటల వల్ల తీవ్ర ఒత్తిడిలో ఉన్న అధికారులకు, పోలీసులకు మానసిక ఉల్లాసం చేకూరుతుందని అన్నారు. సబ్ డివిజన్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో నరసరావుపేట జట్టు విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేపట్టిన నరసరావుపేట జట్టు 332 పరుగులను చేసింది. రెండవ బ్యాటింగ్ చేసిన వినుకొండ జట్టు 320 పరుగులతో ఆలావుట్ అయింది. ఈ పోటీల్లో రమేష్ అత్యధికంగా 150 పరుగలు చేశారు. అదే విధంగా ఇరువురు పోలీస్ అధికారులు సెంచరీ సాధించడం విశేషం.

కోతులతో పల్లెలు గగ్గోలు

- పలు గ్రామాల్లో ఇళ్లమీదనే తిష్ట
- పంట పొలాలపైనా దాడులు
- నియంత్రణలో పంచాయతీలు విఫలం
- బెంబేలెత్తుతున్న జనం



ప్రజాశక్తి-ఈపూరు

అడవులలో ఉండాల్సిన కోతులు జనారణ్యంలోకి వచ్చేస్తూ నానా రభస సృష్టిస్తున్నాయి. వందల సంఖ్యలో ఉన్న కోతులు వీధుల్లో తిరుగుతూ గ్రామ ప్రజలను భయపెడుతున్నాయి. మండలంలోని పలు పంచాయతీల్లో కోతుల బెడద ఎక్కువైంది. ఈపూరు, కొచ్చెర్ల, ఊడిజర్ల, గోపువారిపాలెం, యర్రబాలెం, అగ్నిగుండాల, ఇనిమెళ్ల, బొమ్మరాజుపల్లి, భద్రుపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లో కోతులు నానా హంగామా సృష్టిస్తున్నాయి. వీటి దెబ్బకు పిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. పండ్ల వ్యాపారులు వాటికి కాపలా ఉండలేక నానా అవస్తలు పడుతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి ఆహార పదార్థాలు కనబడితే అవి ఎత్తుకెళుతున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కోతుల బెడద మరింత ఎక్కువగా ఉందని చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో గ్రామస్తులు కొంత నగదు సమకూర్చుకొని పట్టించినప్పటికి మరలా వస్తుండటంతో ఏమి చేయాలో అర్థంకాక అయోమయంలో పడ్డారు. ఊడిజర్ల, కొచ్చెర్ల, బొమ్మరాజుపల్లి, ముప్పాళ్ళ గ్రామాల్లో కోతుల బారినపడి కొందరు గాయాపడ్డారు. అంతేకాక పాఠశాలలపై సంచరిస్తుండటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

అసలు కోతులు ఎక్కడివి

పల్లెలోకి వస్తున్న కోతులు అటవీ ప్రాంతం నుండి వస్తున్నాయా లేక పట్టిన కోతులను శివారు ప్రాంతాల్లో వదిలేసి పోతున్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గత నాలుగైదు సంవత్సరాలుగా గ్రామాల్లో కోతులు అధికం అవుతున్నాయి.అడవుల్లో వదిలిపెట్టాల్సిన కోతులను పరిసర ప్రాంతాల్లో వదలటం వల్ల అవి పల్లెలకు వచ్చేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

రైతులు గగ్గోలు

వ్యవసాయబావులు, బోరుబావులు వద్దకు వెళ్లిన కోతులు మొక్కజొన్న, వరిపంటలను, కూరగాయాల తోటలను ధ్వంసం చేస్తుండటంతో వాటి నుండి పంటలను రక్షించుకునేందుకు నానా అవస్తలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. అలాగే ఇళ్ల వద్ద పెంచుకొనే చెట్లపై తిరుగుతూ వాటి నాశనానికి కారణమవుతున్నాయి. కోతులు జనవాసంలోకి రాకుండా కట్టడి చేయడంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడంలో పంచాయతీల పాలకులు విఫలమవుతున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సినీ దర్శకులు సత్య

'పిచ్చి కాదల్ ' షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -వినుకొండ రూరల్

మండలంలోని ఉప్పరపాలెంలో ' పిచ్చి కాదల్ ' అనే షార్ట్‌ఫిల్మ్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆదివారం సినీ దర్శకులు సత్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్‌కి మంచి ఆదరణ ఉందన్నారు. ఏదైన విషయాన్ని షార్ట్ ఫిల్మ్ ద్వారా సమాజానికి చేరవేయనున్నట్లు తెలిపారు. ఈ ' పిచ్చి కాదల్ ' షార్ట్ ఫిల్మ్ మంచి కథ అని తెలిపారు. దర్శక నిర్మాత అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ ఒక తమిళ అమ్మాయి, ఒక తెలుగు అబ్బాయి మధ్య జరిగే ఒక విభిన్నమైన ప్రేమ కథా చిత్రమని, మంచి సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సత్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్దమాన నటుడు కోటి, జాని, హమిద్, శ్రీ చౌదరి, దాస్ పాల్గొన్నారు.



ప్రసాద్ గీసిన చిత్రం

ప్రకృతిలో నూతన సంవత్సరం

ప్రజాశక్తి -వినుకొండ

పట్టణానికి చెందిన చిత్రకారులు ప్రసాద్ 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2018కి స్వాగతం పలికే విధంగా గీసిన చిత్రం పట్టణ ప్రజలను ఆకట్టుకుంటుంది. ప్రకృతిలో సంవత్సరం అని ఆ చిత్రానికి ఆయన నామకరణం చేశారు. మనం-పొలం-జలం అనే అంశాలను ప్రధానంగా చూపిస్తూ ఆయన గీసిన చిత్రం నూతన సంవత్సరం పాడిపంటలతో సుఖ సంతోషాలతో ప్రజలు వర్దిల్లాలని ప్రసాద్ ఆకాంక్షించారు.

గీతాంజలి స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి -వినుకొండ

స్థానిక గీతాంజలి స్కూల్ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం విద్యార్థులు నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన స్కూల్ ప్రిన్సిపల్ టి. కృష్ణవేణి చిన్నారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్క విద్యార్థి అన్ని రంగాల్లో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారుల చే న్యూఇయర్ కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రతిమ

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు
సోమవారం
1 జనవరి 2018

ధాన్యానికి మద్దతు ధర కోసం

రైతన్నల ఎదురుచూపులు

- నామమాత్రపు ధరతో ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- జిఎస్‌టితో పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో అధికమైన పెట్టుబడులు
- గత ఏడాది మాదిరే ఈ ఏడాది ధాన్యం దిగుబడులు

ఎండకు ఎండి... వానకు తడిసి ...ఎముకలు కొరికే చలిలో.. పొలాల్లో కష్టపడి పని చేసి పదిమందికి పట్టెడన్న పెట్టే అన్నదాత పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమవుతుందని మండలంలోని పలు గ్రామాల రైతులు గగ్గోలు పెడుతున్నారు. గిట్టుబాటు ధర కాదు కనీసం మద్దతు ధరైనా దక్కుతుందో లేదోనని దిగాలు పడున్నారు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి పెరిగిపోయి, చేతికందిన దిగుబడి మంచి రేటు పలికి తమను అప్పుల నుంచి గెట్టెక్కింస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ధాన్యం పండించిన రైతులు మద్దతు ధరకోసం నిరీక్షిస్తున్నారు.

పొలంలో ధాన్యం బస్తాలు



ప్రజాశక్తి-అమర్తలూరు

పెరిగిన కౌలురేట్లు, ఎరువులు, పురుగుమందులు, కూలి ఖర్చులతో ఎకరం భూమి సాగుచేయడానికి సుమారు రూ.50వేల వరకు అవుతుందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం వ్యవసాయ ఖర్చులను దృష్టిలో పెట్టుకోకుండా కంటితుడుపుగా రైతులు పండించిన వరి ధాన్యానికి ధర ప్రకటించడం రైతులను చిన్నచూపు చూడటమే అంటున్నారు. ప్రభుత్వం వరి ధాన్యం 75కిలోల బస్తా సాధారణ రకం రూ.1162-50 పైసలు, ఎ గ్రేడ్ రకం రూ.1192-50 పైసలు నిర్ణయించడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎరువులు, పురుగుమందులపై పన్ను 5శాతం ఉండగా, కొత్తగా ఎరువులు, పురుగు మందులపై ప్రభుత్వం విధించిన 18శాతం జిఎస్‌టి కారణంలో ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంలో విపరీతంగా పెరిగాయని, దీంతో రైతులపై అదనపు భారం పడిందని రైతులు వాపోతున్నారు. ప్రయివేటు వ్యాపారస్థులు కుప్పలు వేసి నూర్పిడి చేసిన వరి ధాన్యం 75కిలోల బస్తా రూ.1300 నుండి రూ.1350లకు కొనుగోలు చేస్తున్నారని, వరి పైరుమీద ఉండగా యంత్రం ద్వారా నూర్పిండి చేసి కొద్దిపాటి తేమ ఉన్న వరి ధాన్యం 75కిలోల బస్తా రూ.1230 నుండి రూ.1250ల వరకు కొనుగోలు చేస్తుండగా ప్రభుత్వం 75కిలోల బస్తాకు సాధారణ రకానికి రూ.1162-50, ఎ గ్రేడ్ రకానికి 1192-50 నిర్ణయించడం విడ్డురంగా ఉందని రైతులు పెదవి విరుస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పెట్టుబడులు అధికంగా ఉన్న ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలో తేడా లేదని రైతులు అంటున్నారు. రైతులకు రబీ సీజన్‌లో సబ్సిడీ మీద అందజేసే మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న విత్తనాలు కూడా ఈ సంవత్సరం రైతులకు పంపిణీ చేయలేదని, బయట మార్కెట్‌లో కిలో మినుము విత్తనాలు రూ40లు ఉంటే ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ విత్తనాలు కిలో రూ.60లు ఉందని దీంతో రైతులు ఇతర రైతుల దగ్గరే రబీ విత్తనాలు కొనుగోలు చేసుకున్నామంటున్నారు. గత సంవత్సరం మినుము, పెసర పంటలకు తలమాడు తెగులు సోకడంతో ఈ సంవత్సరం కొంతమంది రైతులు, బోర్ల దగ్గర రైతులు మొక్కజొన్న, జొన్న పంటల సాగుకు మగ్గుచూపారు. అయితే మొక్కజొన్న, జొన్న పంటల సాగు రైతులకు సబ్సిడీ మీద విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో వారు ప్రయివేటుగా మొక్కజొన్న విత్తనాలు ఎకరాకు రూ.1200లకు, జొన్న విత్తనాలు ఎకరాకు రూ.650 నుండి రూ.850ల వరకు కొనుగోలు చేసి విత్తుకున్నారు. పెదపూడి, మూల్పూరు, కూచిపూడి గ్రామల పరిధిలో కొంత పొలం (తడిలేక) పదును లేకపోవడంతో జొన్న విత్తనాలు మొలకలు రాక తలలు పట్టుకుంటున్నారు. మరలా పొలాలను తడిపి రెండు రోజుల్లో జొన్న విత్తనాలు వేయాలని కౌలు రైతులు అంటున్నారు. అయితే వరి ధాన్యం గత సంవత్సరం ఎకరాకు 35బస్తాల దిగుబడి వస్తే ఈ సంవత్సరం కూడా అదే దిగుబడి వస్తుందని అయితే ఖర్చులు మాత్రం విపరీతంగా పెరిగిపోవడతంతో రైతులకు తలకు మించినభారం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తేనే రైతులు అప్పుల బారినుండి బయటపడతారని లేకపోతే రైతులను అప్పులభారం వెంటడుతునే ఉంటుందని కౌలురైతులు, రైతులు అంటున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని వరి ధాన్యానికి గిట్టుబాటు ధర 75కిలోల బస్తాకు రూ.1500ల వరకు పెంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంటచేలో ధాన్యం కుప్పలు



పెట్టుబడులు పెరిగాయి



ఈ సంవత్సరం వరి పంటలకు అధికంగా తెగుళ్ల రావడంతో పంటలను కాపాడుకోవడానికి గత సంవత్సరం కంటే ఎక్కువ పెట్టుబడులు పెట్టాము. ప్రభుత్వం 75 కిలోల వరి ధాన్యం బస్తాకు మద్దతు ధర రూ.1500లు వరకు పెంచాలి

యలవర్తి రామ్మోహనరావు
రైతు కూచిపూడి

ప్రభుత్వ మద్దతు ధర సరిపోదు

నాలుగైదు ఎకరాల వరకు కౌలు పొలం చేస్తాను. అయితే పెరిగిన ఎరువులు, పురుగు మందులు, కూలిరేట్లతో ప్రభుత్వం 75కిలోల వరి ధాన్యానికి ప్రకటించిన మద్దతు ధర రూ.1200 ఏమాత్రం సరిపోదు. రెండవ పంట దిగుబడి వస్తేనే రైతులు పెట్టిన పెట్టుబడి సరిపోతుంది. గత సంవత్సరం రెండవ పంట రైతులను దెబ్బతీసిందని, దీనికితోడు మినుము, పెసర ధరలేకపోవడంతో రైతులు వ్యవసాయం చేయాలో, వదిలేయాలో అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నాము.

గేరా ప్రతాప్, కౌలురైతు బోడపాడు

మీరిస్తామంటే..

మేమొద్దంటామా..!

రానున్న ఎన్నికలకు ఇప్పటి నుండే కసరత్తు మొదలవుతోంది. అందులో భాగంగానే మహిళలకు ముందరికాళ్లకు బంధాలేస్తూ ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సాధికారత మిత్రల పేరుతో ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం డ్వాక్రా మహిళలను ఉపయోగించనుంది. పేరుకు అర్హులకు పథకాలను చేర్చే ఉద్దేశంతో చేపట్టినట్లు పేర్కొన్నా అధికార పార్టీకి మద్దతును కూడగట్టేందుకేననే విమర్శలూ వస్తున్నాయి.అయితే వీరికి భత్యమేమీ ఇవ్వకపోవడం గమనార్హం.

- పథకాల ప్రచారం పేరుతో కొత్త కార్యక్రమం
- భత్యం లేకుండా ఉపయోగించుకునే యత్నం
- సాధికారిత మిత్రల పేరుతో డ్వాక్రా మహిళలకు పని
- ఒక్కొక్కరికి 30 ఇళ్లు కేటాయింపు
- ఓటు బ్యాంకు ఖాతాలోకి మహిళలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ చేపట్టిన ఆయా సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రజల వద్దకు చేర్చే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సాధికార మిత్రలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా భట్టిప్రోలు మండలంలో 536 మందిని సాధికార మిత్రలుగా గుర్తించారు. వీరంతా డ్వాక్రా మహిళలే కావడం గమనార్హం. వీరందరికీ ఇటీవలే రెండ్రోజులపాటు మండల కేంద్రంలో ప్రత్యేక శిక్షణిచ్చారు. 42 రకాల ప్రభుత్వ పథకాలు, వాటిని ప్రజలకు వివరించే విధానాలపై శిక్షణలో వివరించారు. ఒక్కొక్కరు 30 కుటుంబాలను సందర్శించాలని నిర్దేశించారు. సాధికారిత మిత్రలు ప్రజలు, సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తేవడం ద్వారా పరిష్కరించాలని సూచించారు. అయితే శిక్షణలో పేర్కొన్న పథకాల్లో అనేకం ప్రభుత్వం గతంలో ప్రకటించినవే అయినా అమలైన దాఖలాల్లేవు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, పండ్ల తోటల పెంపకం, ఎన్‌టిఆర్ జలసిరి, పశుగ్రాస క్షేత్రాలు వంటి అనేక రకాల పథకాలు ఇప్పటి వరకూ ప్రజానీకానికి సరిగా చేరలేదు. మద్యం నియంత్రణ, బెల్టు షాపుల రద్దు, చెత్త నుండి సంపద తయారీ పథకాలు సైతం కాగితాలకే పరిమితమయ్యాయి. అయితే వీటిపై మళ్లీ గ్రామాల్లో ప్రచారం చేయడం విడ్డూరమేనని కొందరు వాఖ్యానిస్తున్నారు. నాయకులు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండాలని, ఇందులో ప్రభుత్వానికి మద్దతుదార్లుగా మహిళల్ని మార్చుకునే ఉద్దేశమూ ఉందని మరికొందరంటున్నారు. ఇటీవల అధికారులు ఇచ్చిన శిక్షణ సైతం ఆ దిశగానే సాగింది.

మరోవైపు శిక్షణ పొందిన వారిలో అనేక మందికి కంప్యూటర్ పరిజ్ఞానం, ట్యాబ్‌ల వినియోగం గురించి తెలీదు. పథకాల గురించి సైతం తెలియకపోగా, అర్హులే వారిలోనూ ఉన్నా వారూ పొందలేకపోవడం మరో ప్రత్యేకాంశం. ఈ క్రమంలో తాము శిక్షణకు వచ్చినా గ్రామాల్లోకి వెళ్లి వివరించాలంటే ఎలాగనే అయోమయం నెలకొందని పలువురు శిక్షణ పొందిన మిత్రలే పేర్కొంటున్నారు. మంగళవారం నుండి ఐదో విడత జన్మభూమి ప్రారంభం కానున్న దృష్ట్యా సాధికారిత మిత్రల ద్వారా గ్రామాల్లోకి ముందుగానే వెళ్లి పథకాలను వివరించడం, సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చడం ద్వారా సభల్లో ప్రజల నిరసనలు లేకుండా చూడాలనే ఉద్దేశమూ ఉన్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే రేషన్ కార్డులు, పింఛన్లు, వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల కోసం, ఇతర సామూహిక, వ్యక్తిగత సమస్యలపైనా పలుమార్లు అధికారులు, నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారని, పథకాలను మీరు వర్తింపజేస్తామంటే.. మేము వదంటా మా.. అని మరికొందరు పెదవి విరుస్తున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే డ్వాక్రా మహిళలతో ఇంత పని చేయించుకుంటూ వారికి గౌరవ వేతనంగాని, భత్యం గాని ఇవ్వబోమని చెబుతుండడమూ విమర్శలకు తావిస్తోంది.



ప్రభుత్వం రూపొందించిన పథకాల బ్రోచర్

తమలపాకు సాగులో తలమానికం గుంటూరు





డాక్టర్ పి రమాదేవి

ప్రజాశక్తి-పొన్నూరు

రాష్ట్ర వ్యాప్తంగా తమలపాకు సాగులో గుంటూరు జిల్లానే ప్రథమ స్థానం. జిల్లాలో కేంద్రబిందువుగా పొన్నూరు మండలంలోని చింతలపూడి ప్రాంతం నిలిచింది. గతంలో ఇక్కడ తమలపాకు పరిశోధనా కేంద్రం ఉండేది. ప్రస్తుతం అఖిల భారత సమన్వయ ఔషధ, సుగంధ మొక్కల, తమలపాకు పరిశోధన పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్న గూడెం కేంద్రంగా కొనసాగుతోంది. ఈ కేంద్రాన్ని తిరిగి మనం రాబట్టుకోలేమా? శనివారం ఈ పరిశోధనా కేంద్రం అధిపతి పి రమాదేవి తమలపాకు సాగుపై ఒక్కరోజు శిక్షణ కేంద్రం నిర్వహించటానికి చింతలపూడి గ్రామానికి వచ్చిన సందర్భంలో 'ప్రజాశక్తి' జరిపిన ముఖాముఖిలో ఏం చెప్పారో చూడండి.

తమలపాకు రైతులకు పంటరుణాలు ఎందుకు ఇవ్వట్లేదు?

గతంలో క్రాప్‌లోన్ ఇచ్చేవారు. తమలపాకు నమలటం ద్వారా అనర్థాలు జరుగుతున్నాయని ఎక్స్‌పర్ట్స్ కమిటీ రిపోర్టు ఇవ్వటంతో ప్రభుత్వం క్రాప్‌లోన్‌ను నిలిపివేసింది. పాడైపోయిన వక్క, పొగాకు వంటి వాటితో పాటు తమలపాకు నమలటం ద్వారానే అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని మూడేళ్ల కిందట బెంగళూరు నుంచి రిపోర్టు ప్రభుత్వానికి ఇచ్చారు. ఈ నేపథ్యంలో క్రాప్‌లోన్‌పై ప్రభుత్వం పునరాలోచించే అవకాశం ఉందని భావిస్తున్నాం. తమలపాకు రైతులు కూడా సదస్సులు, శిక్షణా కార్యక్రమాల్లో రాయితీలు, క్రాప్‌లోన్ అంశాలను ప్రస్తావిస్తున్నారు.

తమలపాకు నిజంగానే అనర్థమా?

ఎప్పటికీ కాదు, తమలపాకులో వివిధ పోషక విలువలతో పాటు ఔషధ లక్షణాలు ఉన్నాయి. తమలపాకును ఆయుర్వేద వైద్యంలో వాతం, కఫం, నోటి దుర్వాసన నివారిణిగా, జీర్ణకారిణిగా ఉపయోగిస్తారు. తమలపాకులో ఉండే నూనెకు యాంటిసెప్టిక్ గుణాలు ఉన్నాయి. తమలపాకుకు సరైన రీతిలో ప్రచారం జరగట్లేదు. అటు గుట్కాల పరంగా కూడా తమలపాకుపై దుష్ప్రచారం జరుగుతోంది.

పరిశోధనా కేంద్రం చింతలపూడికి వచ్చే అవకాశం ఉందా?

రాష్ట్ర వ్యాప్తంగా తమలపాకు సాగులో గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. తమలపాకు పరిశోధనా కేంద్రం ఈ ప్రాంతంలో ఉంటేనే రైతాంగానికి ఉపయోగం. గతంలో చింతలపూడిలోనే తమలపాకు పరిశోధనా కేంద్రం ఉండేది. ఎకరం భూమి ఇవ్వటంతో పూర్తిస్థాయిలో పరిశోధనలకు అవకాశం లేకుండా పోయింది. పైగా కార్యాలయం బాపట్లకు తరలించారు. రెండూ విడివిడా నడుస్తున్న నేపథ్యంలో మొత్తాన్నీ వెంకటరామన్న గూడెంకు మార్చారు. అయితే, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి చింతలపూడికి పరిశోధన కేంద్రాన్ని రికమెండ్ చేశారు. నామ్స్ ప్రకారం పరిశోధనకు 20 ఎకరాల సైట్ కావాలి. కనీసం 10 ఎకరాలు ఇచ్చినా తమలపాకు పరిశోధన స్థానం తిరిగి చింతపూడికి చేరకునే అవకాశం ఉంది.

తమలపాకును ఆశిస్తున్న తెగుళ్ల గురించి చెబుతారా?

మన ప్రాంతంలో ముఖ్యంగా ఐదు రకాల తెగుళ్ల ఆశిస్తున్నాయి. అందులో ఆకు, వేరుకుళ్ల, లేదా ఎండు తెగులు ఎక్కువ నష్టాన్ని కలిగిస్తోంది. తమలపాకు తోటను పలురకాల పురుగులు ఆశించిన సందర్భాల్లో రైతులు విరివిగా పురుగుమందులు పిచికారీ చేయటం కరెక్టుకాదు. తమలపాకు పాన్ రూపంలో మనం నేరుగా తింటాం. పురుగుల నివారణా చర్యల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటేనే, పురుగుమందు అవశేషాలు లేని నాణ్యమైన ఆకులు పొందటానికి అవకాశం ఉంటుంది.

చలికాలం ఆశిస్తున్న ఎండు తెగులు గురించి..

నిజమే... రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తుంది. ఈ తెగులు నేలలో ఉండే 'ఫైటాఫ్తరా కాప్సిసి' అనే శిలీంద్రం వలన సోకుతుంది. తెగులు ఆశించిన తీగ నుండి నీటిద్వారా ఆరోగ్యంగా ఉన్న తీగలకు వ్యాప్తిస్తుంది. తెగులు వర్షాకాలంలో వేర్లను ఆశించినప్పటికీ, గాలిలో తేమ 90 శాతం కంటే ఎక్కువగా ఉండి, పగటి ఉష్ణోగ్రతలు 16-20 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైనప్పుడు తెగులు తీవ్రత పెరిగి త్వరగా వ్యాపిస్తుంది. తీగమీద తెగులు లక్షణాలు కనిపించాక ఎటువంటి చర్యలు తీసుకున్నా నివారణ సాధ్యపడదు.

ముందస్తు జాగ్రత్త చర్యలకు అవకాశం లేదా?

సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి నియంత్రించవచ్చు. ముఖ్యంగా పంటమార్పిడి చేయాలి. రెండేళ్ల కొకసారి జొన్న, మొక్కజొన్న సాగుచేస్తుండాలి. ఎకరాకు ఒక టన్ను చొప్పున జిప్సమ్‌ను వేసి అవిశ విత్తనాలు పోయకమునుపే పొలాన్ని కలియదున్నాలి. విత్తనపు తీగ కోసే రెండు నెలలముందు, చలికట్టులో ఎరువు వేయటం ఆపాలి. విత్తనపు తీగను 0.5 బోర్డో మిశ్రమం, 500 పిపియం, స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణంలో 15 నుండి 30 నిమిషాలపాటు ముంచి నాటుకోవాలి. ఎకరాకు రెండు కిలోల మైలతుత్తం 2 కిలోల సున్నం, 200గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్, 400 లీటర్ల నీరు వినియోగించాలి. మొక్క మొదళ్లలో నీరు నిలవకుండా, మురుగునీరు పోయే మార్గం చేయాలి. చలిగాలి తోటలోకి ప్రవేశించకుండా తోట చుట్టూరా దడి కట్టాలి. తెగులు సోకిన ఆకు, తీగలను ఎప్పటికప్పుడు తీసి కాల్చివేయాలి.

తహశీల్దారు కార్యాలయం



కార్యాలయం కూలనుందా?

బ్రిటీష్ కాలంలో నిర్మించిన తహశీల్దారు భవనం త్వరలో కనుమరుగు కానున్నదా? తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో పోలీస్‌స్టేషన్, సబ్ జైలు ఉన్నాయి. వీటిలో తహశీల్దారు ఆఫీసు మాత్రమే ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నూతన భవన నిర్మాణానికి రూ. 90 లక్షలు ఖర్చుకాగలదనే ప్రపోజల్స్‌ను అధికారులు పంపించారనీ, నూతన సంవత్సరంలో ఈ భవనాన్ని కూల్చేస్తారనే ప్రచారం జరుగుతోంది. 1897లో ఈ భవనాన్ని నిర్మించటంతో దీన్ని హెరిటేజ్ (వారసత్వ సంపద) గా ప్రజలు భావిస్తున్నారు. వారసత్వ సంపదగా నిలిచిన ఈ భవనాన్ని కూల్చడానికి నిజంగానే రంగం సిద్ధమైందా? వివరాల్లోకి వెళితే...

ప్రజాశక్తి-పొన్నూరు

వందేళ్లకు పూర్వం నిర్మించిన భవనాలను వారసత్వ సంపదగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం 1897 నిర్మించటంతో ఇది కూడా ఈ కోవలోకే వస్తుంది. తహశీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్, సబ్ జైల్ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. వర్షాకాలంలో భవనం పై కప్పు నుంచి నీరు కారటం, గోడలు దెబ్బతినటంతో ఇప్పటికే సబ్ జైలును మూసివేసి అందులోని ఖైదీలను బాపట్ల జైలుకు తరలించారు. ఈ ప్రక్రియ జరిగి రెండేళ్లు కావస్తోంది. నూతన భవనం నిర్మాణానికి నిధులున్నప్పటికీ కొన్నికారణాల రీత్యా సబ్ జైల్ భవన నిర్మాణం జరగలేదు. ఇక పోలీస్‌స్టేషన్ కు నాటి సిఐ హుస్సేన్ 2013లో కొంతమేరకు రిపేర్లు చేయించినప్పటికీ, ఫలితం లేకపోయింది. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెనుకవైపు నిరుపయోగంగా ఉన్న ఎస్ఐ క్వార్టర్స్‌లోకి అర్బన్ పోలీస్‌స్టేషన్‌ను మార్చారు. ఈ మార్పు జరిగి కూడా ఏడాదిన్నర కావస్తోంది. శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తారని గతం లో అధికారులు ప్రకటించినప్పటికీ నేటికీ మూతపడే ఉంది.

ఇక తహశీల్దారు కార్యాలయం పై కప్పు దెబ్బతినటంతో వర్షాకాలంలో కార్యాలయంలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాట్కో సంస్థ కార్యాలయ రికార్డుల రక్షణకు పై కప్పుపై షీట్లు పరిపించేఏర్పాటు చేసినప్పటికీ, ఆర్ఐ గది మరికొన్ని గదుల తడుస్తూనే ఉన్నాయి. దీనికితోడు గోడలు కూడా దెబ్బతిన్నాయి. పైగా ఇదే ప్రాంగణంలోని పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు మూతపడటంతోపాటు, పక్కనే ఉన్న సత్రం నుంచి పాములు కూడా కార్యాలయంలోకి వస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇదే ప్రాంగణంలో ఓ పామును స్థానికులు చంపగా, అప్పుడప్పుడు పాములు, పాము పిల్లలు కూడా దర్శనమిస్తున్నాయి. గురువారం కూడా పైకప్పు పెంకుల్లో దూరిన పామును చంపారు. దీంతో అధికారులు, సిబ్బందితోపాటు, స్థానికుల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తహశీల్దారు కార్యాలయం కూల్చివేసి నూతన నిర్మాణాన్ని చేపడతారనే ప్రచారం ఊపందుకుంది. దీంతో మన వారసత్వ సంపద కోల్పోతున్నామా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతోంది.



కార్యాలయ నిర్మాణ సంవత్సరం

ప్రతిపాదనలు పంపిచాం



నూతన భవన ఏర్పాటుకు రూ.90 లక్షలు ఖర్చుకాగలదన్న ప్రపోజల్స్ మాత్రమే పంపించాం. అది కూడా పోలీస్‌స్టేషన్ నిర్మాణంతో సంబంధంలేదు. కేవలం తహశీల్దారు కార్యాలయానికి సంబంధించినంతవరకే. హెరిటేజ్ (వారసత్వ సంపద) అంశం గురించి ఉన్నతాధి కారులు తీసుకోవాల్సిన నిర్ణయం. కార్యాలయ కూల్చివేతకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకో లేదు. కార్యాలయానికి పక్కనే ఉన్న సత్రం, పరిసరాల పరిశు భ్రతపై శ్రద్ధ తీసుకోవట్లేదు. దీంతో పాము లు వస్తున్నాయి. వారికి రెండ్రోజుల్లో నోటీసులు పంపిస్తాం.

- ఆర్ వెంకటరమణ నాయక్, తహశీల్దారు, పొన్నూరు.

సిఎం చంద్రబాబుకు భూదాహం

- రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకు ఏర్పాటు
- భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు
- ప్రజల నోట్లో మట్టిగొడితే ఒప్పుకోం : సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ సిహెచ్ బాబురావు
- ఉండవల్లిలో రైతులతో బహిరంగ సభ



మాట్లాడుతున్న సిపిఎం రాజధాని డివిజన్ కన్వీనర్ సిహెచ్ బాబురావు, భూపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - తాడేపల్లి

సిఎం చంద్రబాబుకు భూదాహం పట్టిందని, రాష్ట్రంలో 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంకు ఏర్పాటుచేసి విదేశీ కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్ట పూనుకున్నారని ఆంధ్రప్రదేశ్ భూపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాజధాని అమరావతి సీడ్ క్యాపిటల్ పరిధిలోని గ్రామాల్లో భూసేకరణకు ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనకు వ్యతిరేకంగా గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లిలో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. సభకు రైతు సంఘం రాజధాని డివిజన్ నాయకులు కె.జగదీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వందెకరాలు అవసరం ఉన్నచోట వెయ్యి ఎకరాలను గుంజుకోడానికి యత్నిస్తున్నారని, ప్రపంచంలోని పెట్టుబడిదార్లకు రైతుల భూములను పందేరం చేయడానికి ఆహ్వానిస్తున్నారని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి 5వేల ఎకరాలు సరిపోతుందని, పూలింగ్ పేరుతో 35 వేల ఎకరాలు సమీకరించారని, ప్రభుత్వ, అటవి భూములు మరో 60 వేల ఎకరాలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారని తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలిచ్చారా? అని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టాన్ని మార్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్న నేపథ్యంలో రైతులకు భూ పరిరక్షణ కమిటీ అండగా ఉంటుందని, పోరాటాల ద్వారానే ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టగలమని చెప్పారు.

సిపిఎం సిఆర్‌డిఎ కన్వీనర్ సిహెచ్ బాబురావు మాట్లాడుతూ తాత్కాలిక రాజధాని నిర్మాణానికే మూడేళ్లు పడితే అసలైన రాజధానికి ఎన్నేళ్లు పడుతుందని ప్రశ్నించారు. ఉండవల్లి, పెనుమాక భూములు ఏ కార్పొరే ట్ శక్తులకు ఇస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీసిన ఆయన 420గా ముద్రపడిన ఎస్ఆర్ఎం, విఐటి లాంటి సంస్థలకు గజం రూ.వెయ్యికే అప్పగిస్తున్నారని, మరికొన్ని కాలేజీలకు గజం రూ.200కు ఇస్తున్నారని, ఇది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని దుయ్యబట్టారు. రైతులు, కూలీలు నోట్లో మట్టిగొట్టే చర్యలకు తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. చట్టబద్ధంగా పోరాడుతుంటే చట్ట వ్యతిరేకంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు. హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని నియంత్రించడం నిజం కాదా? అని ప్రశ్నించారు.

భూ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పూలపెద్దిరెడ్డి మాట్లాడుతూ రాజధానిలో ప్రజలందర్నీ భయభ్రాంతులు చేసి పచ్చచొక్కాల కార్యకర్తలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. భూమిపై ఉన్న రైతులకు, కౌలు రైతులకు పట్టాలు, భూమి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం పెద్దోళ్లకు భూములు కట్టబెట్టే పనిలోఉందని దుయ్యబట్టారు. 15 లక్షల ఎకరాల భూమి కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని, రైతులను లొంగదీసు కోడాన్ని సాగనివ్వబోమని అన్నారు. సభలో వివిధ పార్టీల నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, పి.కృష్ణమూర్తి, డి.బాలాజిరెడ్డి, ఎం.దామేశ్వరరెడ్డి, ఎస్‌కె.పీరుసాహెబ్, పూర్ణచంద్రరావు, ఇ.రామారావు, బి.వెంకటేశ్వర్లు, జి.సాంబశివరావు, వి.వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

పోరాడుతున్న రైతులకు అభినందనలు



మూడేళ్ల నుండి రాజధానిలో ఎన్ని ఇబ్బందులున్నా మడమ తిప్పని పోరాటం చేస్తున్న అందరికీ అభినందనలు. ప్రభుత్వ చర్యలతో భూముల రేట్లు పడిపోయాయి. వామపక్ష పోరాటాల ద్వారా వచ్చిన 2013 భూసేకరణ చట్టాన్ని ఎట్టి పరిస్థితిల్లో మార్చకూడదు. భూములివ్వని వారిపై బలప్రయోగం తగదు. 2013 భూసేకరణ చట్టాన్ని సవరణ చేయాల్సి వస్తే బాధితులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చాలేగాని నష్టం చేయకూడదు.

పి.నరసింహారావు , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

భూమి, రైతు బంధం విడదీయరానిది



భూమికి, రైతుకు ఉన్న బంధం విడదీయరానిది. భూమి నుండి రైతును దూరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రజల సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకుంటుంది. భూ సమీకరణ కింద రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. భూ సేకరణ నోటిఫికేషన్‌ఇచ్చి ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల కంటిమీద కునుకు దూరం చేసింది. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, అన్ని రకాల వృత్తిదారులు ఐకమత్యంగా కదిలి ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎండగట్టాలి.

జొన్నా శివశంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు.

నోటీసులు ఇచ్చి భయపెడుతున్నారు



పూలింగ్‌లో మా భూములివ్వలేదు. నోటీసులు ఇచ్చి ప్రభుత్వం మమ్మల్ని భయపెడుతోంది. నోటీసుల్లో కూడా హేతుబద్ధత లేదు. అందరం కలిసి ఈ ఉపద్రవాన్ని ఎదుర్కోవాలి.

నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, నిడమర్రు.

వాస్తవాలు చెప్పరా?



సిఆర్‌డిఎ అధికారులు భూసేకరణ అవగాహనా సదస్సులంటూ సమావేశాలు నిర్వహిస్తున్నా రైతులకు వాస్తవాలు చెప్పడంలేదు. మీరు ఏ హోదాలో ఈ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని అడిగినా సరైన సమాధానమే లేదు. సమావేశాల్లో రైతులు చట్టపరంగా సిఆర్‌డిఎలో ఉన్న అంశాల ఆధారంగా అడుగుతున్న ప్రశ్నలకు అధికారుల వైపు నుండి స్పందన నామమాత్రంగా ఉంటుంది. ఉండవల్లిలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన భూముల్లో ఏ నిర్మాణాలు చేయబోతున్నారో ముందుగానే చెప్పాలి.


ఎం.రవి, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి.

భయపెడుతున్నారు

రాజధానిలో రైతులను ప్రభుత్వం భయపెడుతుంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయడానికి పూనుకుంది. ఇష్టం వచ్చినట్లు భూసేకరణకు నోటిఫికేషన్లు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. రైతుల నుండి భూములు గుంజుకోవడానికి చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు.

టి.రామకృష్ణారెడ్డి, వైసిపి రైతు విభాగం రాష్ట్ర నాయకులు.

ప్రమాణాన్ని ఆచరించండి



రాజ్యాంగం మీద ప్రమాణం చేసి సిఎం పగ్గాలు చేపట్టారు. చేసిన ప్రమాణాలను ఆచరించండి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రైతుల భూములు కాజేయాలనే ప్రయత్నాలు మానుకోండి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి రావలసిన సమయం ఆసన్నమైంది. ప్రజలను సమీకరించి పెద్దఎత్తున పోరాటాలు చేసినపుడే ప్రభుత్వ విధానాలు నిలువరించగలం.

దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతుసంఘం నాయకులు.


ఐక్యంగా నిలబడదాం



అందరం ఐక్యంగా నిలబడదాం. స్థానిక ఎమ్మెల్యేతో పాటు వామపక్షాల సహకారం బాగుంది. గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోరాటానికి సిద్ధం కావాలి. ఆచరణ, ఆశయం కలగలిసి ముందుకు సాగాలి. కోర్టుల్లో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిలువరించడానికి మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం.

నిర్మలత, న్యాయవాది

అనుమతి లేకుండానే పొలంలో రోడ్డు



నా అనుమతి లేకుండానే పొలంలో రోడ్డు వేశారు. నేను పూలింగ్‌లో భూమి ఇవ్వలేదు. బలవంతంగా రైతుల భూముల్లో నిర్మాణాలు చేసే చట్టం ఏమైనా ఉందా? ఉండవల్లిలో నేను కొన్ని రోజులు లేకపోవడం వలన ప్రభుత్వం చేసిన ఈ అన్యాయాన్ని గమనించలేకపోయాం. నా భూమి నాకు దక్కడానికి ఏ పోరాటానికైనా సిద్ధం.

శింగంశెట్టి అంజిబాబు

కేసులు పెట్టి వేధిస్తున్నారు



పంట పొలాలను తగులబెట్టారు. ఆ పేరుతో రైతులను పోలీస్టేషన్లకు తరలించి రోజుల తరబడి తిప్పి ఇబ్బంది పెట్టారు. పొలాలను తగులబెట్టి మూడేల్లయినా దోషులెవరో ఈ ప్రభుత్వం తేల్చలేదు.

కె.జగదీశ్వరరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు.

రేపటి నుండి జన్మభూమి - మా ఊరు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఐదో విడత జన్మభూమి కార్యక్రమం మంగళవారం నుండి నిర్వహిస్తామని ఎంపిడిఒ జె.మోహనరావు మంగళవారం తెలిపారు. 2న మందడం, వెంకటపాలెం, 3న ఐనవోలు, శాఖమూరు, 4న మల్కాపురం, వెలగపూడి, 5న రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, 6న అబ్బురాజుపాలెం, బోరుపాలెం, హరిశ్చంద్రపురం, 8న పెదపరిమి, నెక్కల్లు, 9న దొండపాడు, లింగాయపాలెం, 10న అనంతవరం, వడ్డమాను, 11న తుళ్లూరు నేలపాడులో గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు.



మాట్లాడుతున్న రావి వెంకటరమణ

బెల్టుషాపులు తెచ్చింది చంద్రబాబే

అఖిలపక్ష సభలో వక్తలు

ప్రజాశక్తి-పొన్నూరు

రాష్ట్రంలో తాగునీరు అందని గ్రామాలు లెక్కకు మించి ఉన్నాయనీ, మద్యం దొరకని గ్రామం ఒక్కటికూడా లేదని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వ తీరును తూర్పారబట్టారు. రాష్ట్రానికి బెల్టుషాపులు పరిచయం చేసింది చంద్రబాబు నాయుడేనని తేల్చిచెప్పారు. బెల్టు షాపుల కారణంగా ప్రజా జీవితాలు నాశనమవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వానికి పట్టట్లేదని విమర్శించారు. పొన్నూరు నియోజకవర్గ స్థాయిలో అఖిలపక్షం బెల్లు షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా ఆదివానం ఎన్‌జి రంగా విగ్రహం వద్ద ధర్నా నిర్వహించాయి. పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ బొనిగల వేణు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ మాట్లాడుతూ బెల్టుషాపులకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటానికి మహిళలు కలసిరావాలని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బెల్టును తొలగించటానికి కృషిచేయాలన్నారు. రుణమాఫీ పేరుతో టిడిపి దొంగ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రశ్నించిన ప్రతిపక్షాలను అణగదొక్కేస్తోందని విమర్శించారు. 30 ఏళ్లకు పైబడి ఎమ్మెల్యే కుటుంబం నియోజకవర్గాన్ని పాలించినా, ఏమైనా అభివృద్ధి చేసిందా? అని ప్రశ్నించారు. దోచుకో... దాచుకో... అన్న తీరులో పాలన సాగిపోతోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే యం ముస్తాఫా, మాజీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, పొన్నూరు జడ్‌పిటిసి కోట శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఎన్ రూత్‌రాణి, వివిధ రాజకీయ పార్టీ నేతలు, వామపక్ష ప్రజాతంత్రవాదులు, కులసంఘాల నాయకులు మాట్లాడారు.

టిడిపి నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపి మాగంటి బాబు

కైకలూరు : ప్రజలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు మెరుగైన సేవలు అందించినప్పుడే పార్టీ మనుగడ ఉంటుందని ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. మండలంలోని ఆటపాకలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలమైన నియోజకవర్గ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని అందుకు జయమంగళలను అభినందించారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య తలెత్తిన పార్టీ కార్యాలయానికి తెలియజేసి పరిష్కారం దిశగా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. పార్టీ విజయవంతంగా ఉంటేనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతామని, ప్రజలకు సేవలు అందిస్తేనే పార్టీపై నమ్మకం ఉంటుందని ప్రజలు నమ్ముకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు, కార్యకర్తలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ఎఎంసి చైర్మన్ చైర్మన్ వల్లబనేని శ్రీనివాసచౌదరి, జడ్పిటిసి నున్న రమాదేవి, కైకలూరు, మండవల్లి, కలిదిండి, మండలాధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్‌రాజ్, తలారి వెంటకస్వామి, పోకల జోగిరాజు, టిడిపి నాయకులు చిట్టూరి రవీంద్ర, కొల్లేరు సంఘాల ప్రధాన కార్యదర్శి బలే ఏసురాజు, సయ్యపురాజు గుర్రాజు.తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమలయ్య

ప్రజాశక్తి - ఎ.కొండూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించి, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడితే గుణపాఠం తప్పదని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పటాపంచల జమలయ్య అన్నారు. ఆదివారం మండలం లోని కోడూరు, కంభంపాడు, ఎ.కొండూరు తండా, చీమలపాడు గ్రామాలలో రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వ హించిన రైతుయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంపలగూడెం మండలం, పెనుగొలను రైతులు నకిలీ మిర్చినారు వల్ల నష్టపోతే పరిహారం ఇవ్వాలని వ్యవసాయశాఖ కమీషనర్, కలెక్టర్ ఆదేశాల్చి సంవత్సరం అవుతున్నా నేటికి నర్సరీ యజమానులు పరిహారం ఇవ్వలేదన్నారు. ఆగ్రామంలో 87 మంది రైతులు 161 ఎకరాలలో మిర్చి పంట సాగుచేయగా నకిలీ నారు కావ డంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికల ఆధారంగా జిల్లా కలెక్టర్ ఎకరానికి రూ.91 వేలు నష్టపరిహారం చెల్లించాలని నర్సరీ యజమానులను ఆదేశించినా వాటిని ఇవ్వనీయకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఎ.కొండూరు మండంలో కూడా నకిలీ మిరప నారుతో గిరిజన రైతులు కూడా ఈయేడాది నష్టపోయారని, వారికి కూడా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేస్తానని, రైతుల రుణాలను పూర్తిగా మాఫీచేస్తానని వాగ్దానంచేసి అధి కారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. రాష్ట్రంలో రూ. 88 వేల కోట్లు రు ణాలను మాఫీ చేయాల్సివుండగా రూ.11వేల కోట్లకు మాత్రమే మాఫీ జరిగిందన్నారు. ప్రభుత్వం అను చరిస్తున్న విధానాలవల్ల వ్యవసాయం పూర్తిగా సంక్షోభంలో కూరుకు పోయిందన్నారు. వ్యవసాయం చేయాలంటే రైతులు బయపడుతున్నారన్నారు. గిట్టుబాటు ధర కోసం రైతులు అనేక రాష్ట్రాలలో రోడ్లెక్కి ఆందోళణ చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదని రైతులు కన్నెరచేస్తే ప్రభుత్వాలు కూలిపోతాయని జమలయ్య హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం పశ్చిమకృష్ణా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు, కౌలు రైతుసంఘం పశ్చిమకృష్ణా అధ్యక్ష, కార్యదర్శులు గువ్వల సీతారామిరెడ్డి, నిమ్మగడ్డ నరసింహా, రైతుసంఘం తిరువూరు మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, రైతుసంఘం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, యోహాన్, కావూరి రాములు, ప్రజాసంఘాల నాయకులు గోపిరాజు, జెట్టి వెంకటేశ్వరరావు, రాముడు, గోపి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గువ్వల సీతారామిరెడ్డి

సేవకు మించిన తృప్తి మరొకటి లేదు



చీరెలు పంపిణీ చేస్తున్న కిరణ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సమాజంలో వృద్ధులకు, బడుగు వర్గాల వారికి సేవచేయడంలో ఉన్నంత తృప్తి మరోటి లేదని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్ అన్నారు. బాడవపేట 4వ లైనులో గొర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్ట్, విక్రాంత్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు పేదవారికి చీరెల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కిరణ్ మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజు కానుకగా చీరెలు పంపిణీచేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. వృద్ధులకు సేవచేస్తున్నట్లే పేద విద్యార్థులకు కార్పొరేట్ సంస్థలు ఉపకార వేతనాలు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విక్రాంత్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ గొర్తి సత్యవతి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది వృద్ధులకు, వితంతువులకు, పేదలకు ఉచితంగా 200 మందికి చీరెలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమట్రస్ట్‌తో పాటు బాడవపేట పెద్దలు సహాయ సహకారాలు అందిస్తూ పేదలకు సేవలందించడం ముదుస్వభావం అన్నారు. సమాజంలో ఎంతో మంది ధనవంతులు ఉన్నారని వారిలో 50 శాతం మంది నిరుపేదల కోసం ట్రస్ట్లు స్థాపించి ఆదుకుంటే కొంతవరకు అయిన ప్రభుత్వం చేసే అభివృద్ధిలో పాలుపంచుకున్న వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కార్పొరేటర్ ఆతుకూరి రవి కుమార్, టి.రామి శంకర్, వి.మోహన్, జె.రాజా, బాడవ పేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

వత్సవాయి : మక్కపేట ఎంపియుపి పాఠశాల్లో నిర్వహించిన యుటిఎఫ్ సమీక్షా సమావేశంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల గాంధీ చేతుల మీదుగా 2018 డైరీ, క్యాలెండరు, సిఎల్ బుక్స్, ఎటిఎం ఫాస్ ఆవిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడేది యుటిఎఫ్ సంఘమేనని అన్నారు. యుటిఎఫ్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ అతి పెద్ద సంఘమని అన్నారు. యుటిఎఫ్ వత్సవాయి మండల అధ్యక్షులు అజ్మీరు శ్రీను అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి హుస్సేన్ సాహెబ్, దస్తగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్‌వి సత్యనారాయణ, పులి శ్రీనివాసరావు, గోవిందరాజు, పాటశాల ప్రధానోపాధ్యాయులు నెల్లూరి కృష్ణయ్య, ప్రవీణ, వత్సవాయి మండల యుటిఎఫ్ కోశాధికారి ఎం.సత్యనారాయణ, సూర్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ డైరీ క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఎఎంసి చైర్మన్ మల్లెల గాంధీ, యుటిఎఫ్ నాయకులు



పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్యాలెండర్ ఆవిష్కరణ

పెనుగంచిప్రోలు : మండల పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన క్యాలెండర్‌ను ఆదివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఓ వై శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ కె నాగేశ్వరరావు, ఎంపిపి వెల్ది జ్యోతి, జెడ్పీటీసీ గింజుపల్లి శ్రీదేవిలు ఆవిష్కరించారు. ప్రతి ఏడాది పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను ముద్రించి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు చుంచు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, షేక్ నజీర్, సునీల్, నరేందర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్మభూమి సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - జి.కొండూరు

ప్రభుత్వం జనవరి రెండు నుండి చేపట్టిన జన్మభూమి మహోత్సవాలను జయప్రదం చేయాలని మండల టిడిపి ప్రధాన క్యారదర్శి కొల్లి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ప్రజల అవసరాలను, అభ్యర్ధనలను గుర్తించిన ప్రభుత్వం జన్మభూమి గ్రామ సభలు ద్వారా వారి సమ స్యలను తక్షణమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. పేదరికంలో బాధలుపడుతున్న ఆర్తులను ఆదుకోవడ మే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి గ్రామసభల ద్వారా అధికారులను, ప్రజాప్రతినిధుల ను ప్రజల వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులతో పాటు జన్మభూమి కమిటీలు, ప్రజా ప్రతిని ధులు, పార్టీ నాయకులు, కలిసి ఒక ఉత్సవంలా జన్మభూమిని జరపబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిఒక్కరు సేవాభావంతో ముందుకొచ్చి 11వ తేదీ వరకు జరగనున్న జన్మభూమి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న నాగేశ్వరరావు)

పల్లెప్రగతికి పంచదార పరిశ్రమలే పట్టుకొమ్మలు

ప్రజాశక్తి - మొవ్వ

గ్రామీణ ప్రాంతంలో రైతన్నలకు నికర ఆదాయాన్నిచ్చే చెరకు పంట నుంచి చక్కెర తయారుచేసే పంచదార పరిశ్రమలే పల్లెప్రగతికి పట్టుకొమ్మలని లక్ష్మీపురం కెసిపి డిజిఎం మండవ రామ్మోహనరావు పేర్కొన్నారు. మొవ్వ ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ మిగిలిన పంటల మాదిరిగా వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా నికర ఆదాయానిచ్చే చెరకుసాగుపై రైతులు అధిక సంఖ్యలో ఆసక్తిచూపుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని చెరకు కర్మాగారాలకంటే లక్ష్మీపురం కర్మాగారం ఆదాయంతో సంబంధం లేకుండా రైతు శ్రేయస్సుకు విశేష కృషిచేస్తుందని, దీంతో ఎన్నో అవార్డులు అందుకుందన్నారు. కార్మిక రక్షణ, నాణ్యతాప్రమాణాలు సాధించటంతోపాటు సమాజసేవలో పలు అభివృద్ధి పనులకు సహకరిస్తుందన్నారు. మన ప్రాంత చెరకుతోపాటు డెల్టా షుగర్స్ కింద ఉన్న పంటతో కలిపి 1.75లక్షల టన్నులు గానుగ ఆడనున్నట్లు తెలిపారు. విత్తనం వేసిన దగ్గర నుంచి రైతులకు కావల్సిన అన్ని యాజమాన్య పద్ధతులను, సాంకేతిక సలహాలను అందిస్తూ నిత్యం రైతులతో మమేకమై ప్రోత్సహిస్తుందన్నారు. వీరితోపాటు కంపెనీ ఎడ్వయిజర్ వెంకటేశ్వరరావు, క్షేత్రపరిశీలకులు వేణు, శ్రీనివాస్, రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోనరావు



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంపిపి ముద్దన నగరాజకుమారి

ఎస్‌టియు డైరీలు, క్యాలెండర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన డైరీలు, క్యాలెండర్లను ఆదివారం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి నగరాజకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు, అధికారుల సమాచారం ఏర్పాటు చేసిన ఈ డైరీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహన్‌రావు, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ముద్దన రాఘవయ్య, ఎస్టీయు మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారావు, సద్గుణరావు, సుభాసుంధరం, వాసు, వీరాంజనేయులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి జొన్నకూటి సుబ్బారావు ఉన్నారు.

ఫ్లెక్సీల మయం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమాన రాజకీయ నాయకులు, సినిమా హీరోల ఫ్లెక్సీలు కట్టారు. మండల కేంద్రమైన రొంపిచర్ల చేరువుకట్ట సెంటర్లో టిడిపి, వైసిపి నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా బార్లు వైన్ షాపులు మందుబాబులుతో కిటకిట లాడుతున్నాయి.

అవాంఛనీయ ఘటనలపై ప్రచారం

ప్రజాశక్తి-రొంపిచర్ల

నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జరుపుకోవాలని తెలుపుతూ మండల కేంద్రం రొంపిచర్ల పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఎక్కడైనా అల్లర్లు, గొడవలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బార్లు వైన్ షాపులు మిగిలిన అన్ని రకాల షాపులు 10 గంటలకు మూసివేయాలని సూచించారు. యువకులు మద్యం తాగి ద్విచక్ర వాహనాలపై చక్కర్లు విన్యాసాలు చేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు.

తొలగింపు పేరుతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని బరంపేటలో ప్రణాళిక విభాగం అధికారులు అడ్డగోలుగా కొందరి ఇళ్ళముందు మెట్లను, కాల్వలను ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తొలగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం అడ్డగోలుగా తొలగించిన వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారం నిర్మాణాలను కూల్చివేయడం దారుణమన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా కొందరిని ఇబ్బందులు పాలు చేయడానికే ఇలాంటి చర్యలు అధికారులు చేపడుతున్నారని విమర్శించారు. అధికారులతో ఆయన ఫోనులో మాట్లాడారు.



తొలగించిన ఆక్రమణలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

జన్మభూమిలో సాగునీటి కోసం అర్జీలు ఇవ్వండి

ప్రజాశక్తి - పెదనందిపాడు

జనవరి 2వ తేది నుండి ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయా గ్రామాలకు అధికారులు వచ్చినప్పుడు తమకు గుంటూరు ఛానల్ పర్చూరు వరకరు పొడిగించి సాగునీరు, తాగునీరు ఇవ్వాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ సంతకాలతో కూడిన అర్జీలను అధికారులకు ఇవ్వాలని కౌలు రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తా శివనాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతు సంఘం, ఎపి రైతు సంఘాలు నాయకులు పర్చూరు, పెదనందిపాడు, కాకుమాను, పత్తిపాడు, చిలకలూరిపేట, యడ్లపాడు



మాట్లాడుతున్న కొత్తా శివనాగేశ్వరరావు

మండలాలకు చెందిన 50 గ్రామాల్లో రైతు యాత్ర నిర్వహించారని అన్నారు., ఈ సందర్భంగా ఈ ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను సిఎం దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో రైతులు అర్జీలు పెట్టినప్పటికి ఇంతవరకు వారికి అవకాశం ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. ఈ నేపథ్యంలో తాము రైతు యాత్ర సాగించిన 50 గ్రామాలకు చెందిన రైతులు గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు అర్జీలను ఇవ్వాలని కోరారు. పత్తిలో గులాబి రంగు పురుగు తీవ్రతకు పంటలు దెబ్బతిన్న రైతులతో ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘ జిల్లా కమిటీ సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు, ప్రత్తిపాడు మండల రైతు సంఘ కన్వీనర్ కె.ఆదినారాయణ, కాకుమాను మండల కౌలు రైతు సంఘ నాయకులు కందుల శ్రీను, శాఖమూరి శ్రీరంగనాయకులు, కాపు వెంకట సుబ్బారావు, నక్కల సుబ్బారావు, కె.అప్పయ్యచౌదరి ఉన్నారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్



ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -వినుకొండ

గంగినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైతన్య విద్యా సంస్థల ఎజిఎం డి.శ్రీనివాసరావు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంగినేని రాఘవ మాట్లాడుతూ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఈ పరీక్షకు సుమారు 300 మంది విద్యార్థులు హజరయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగినేని రామయ్య, వై.ఎల్.కిషోర్, భాస్కర్ రెడ్డి, సుభాని, శ్రీనివాసరావు, పలు విద్యా సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులు పొదిలికి మాజీ మంత్రి కాసు నివాళి

కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు మృతికి పలువురు సంతాపం

ప్రజాశక్తి - నరసరావుపేట

మాజీ కౌన్సిలర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొదిలి వెంకటేశ్వర్లు వృద్ధాప్యంతో అకస్మికంగా మరణించారు. ఆయన మృతికి మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి నివాళులర్పించారు. రాజకీయంగా సన్నిహితంగా ఉన్న పొదిలి ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. వారి మృతికి సంతాపాన్ని తెలిపారు. వారి వెంట నాయకులు బోయిన సుబ్బారావు, నాసర్, అట్లూరి విజయ్‌కుమార్, మౌలాలి, తామస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సంతాపం

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొదిలి వెంకటేశ్వర్లు మృతి పట్ల తన సంతాపాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తపరిచారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పూర్వాధ్యక్షుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

గ్రూప్ సంస్థ పూర్వాధ్యక్షుల ఆత్మీయ సమావేశం విజయకుమార్ కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో వైశ్యులే ప్రముఖంగా ముందుంటారని ప్రశంసించారు. కార్యక్రమంలో గురుపెద్దన్న, సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, సుబ్బారావు, డాక్టర్ జి.కృష్ణకాంత్, మూర్తి, వెంకటేశ్వర్లు, గౌడు వెంకటేశ్వర్లు, కొత్తా సాంబశివరావు, 14 సంస్థల పూర్వాధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మతోన్మాదశక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-వినుకొండ

ముస్లిం మత గురువు మహమ్మద్ ఫరూక్‌ను హత్యచేయటం, పవిత్ర గ్రంథం ఖురాన్‌ను తగలబెట్టడం అత్యంత దారుణమని, ఇటువంటి దారుణ కాండను ముస్లిం సంక్షేమ సంఘం ఆదివారం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అధ్యక్షులు పిఎస్.ఖాన్ మాట్లాడుతూ రాజమండ్రి బత్తి నగర్‌లోని మసీదులోకి ప్రవేశించిన మతోన్మాధ శక్తులు మత గురువు మహమ్మద్ ఫరూక్‌ను హత్య చేయటం దారుణమన్నారు. మత గురువు హత్యతో పాటు ముస్లీంల పవిత్ర గ్రంథం ఖురాన్‌ను తగలబెట్టడం అమానుషం అన్నారు. ఇలాంటి



మాట్లాడుతున్న పిఎస్.ఖాన్

సంఘటనలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ కాంట్రాక్టర్ గౌస్‌బాషా, ఎం.ఎస్.కె.బాషా, సిహెచ్. సుభాని, ఎం. మస్తాన్‌వలి, పట్టా యాసీన్, జమీల్, ఎం. ఖాజీబేక్, మన్సూర్, అజారుద్దిన్ పాల్గొన్నారు.

ప్రతి వార్డుకూ త్వరలో సాగర్ నీరు

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణాన్ని కొన్ని శతాబ్దాలుగా పట్టి పీడిస్తున్న తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరించబోతున్నామని, ఇందుకు ప్రభుత్వం రూ.102 కోట్లు నిధులు విడుదల చేసిందని, మూడు నెలల్లో సాగర్ నుంచి తాగునీటి సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక 1వవార్డు శీతయ్యనగర్, 12వ వార్డు మహాలక్ష్మమ్మ బజార్‌లోని ప్రభుత్వ పాఠశాల్లో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్లజోళ్ళ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పట్టణంలోని ప్రతి వార్డుకు సాగర్ నీరు సరఫరా చేసేందుకు పనులు ప్రారంబించనున్నామన్నారు. దొండపాడు చెరువు నుంచి పైప్‌లైన్ ద్వారా సింగర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ

చెరువుకు సాగర్ నీరు నింపి పట్టణ ప్రజలకు తాగునీరు అందిస్తామని చెప్పారు. రాజీవ్ గృహకల్ప పథకం ద్వారా పేదలకు ఇల్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. టిడిపి ప్రభుత్వంలో వినుకొండ వాసులకు 4 వేలు ఇల్లు అపార్టుమెంట్ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సౌదాగర్ జానీబాషా, జీవీ రమణ, పల్లెమీసాల దాసయ్య, జీవీ ఆరణ , వార్డు టిడిపి నాయకులు ఉన్నారు.

మర్కస్ మస్‌జీద్ నిర్మాణ శంకుస్థాపన..

పట్టణంలోని కుమ్మరిబాజార్‌లో మర్కస్ మస్‌జీద్ నూతన నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్కస్‌మస్‌జీద్ నిర్మాణానికి తమ వంతు సహాకారం ఉంటుందన్నారు. జనవరి 2వ తేదీ నుంచి జన్మభూమి సభలు జరగనున్నాయని, ప్రజలు సభలను సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మానాయుడు, డీసీసీ మక్కెన మల్లికార్జునరావు మస్‌జీద్ నిర్మాణ శంకుస్థాపనకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మసీదును భారీ ఎత్తున నిర్మాణం చేయటం, పెద్దలందరూ ఐక్య కార్యాచరణతో ముందుకు రావటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అడ్డుఅదుపు లేని మట్టి అక్రమ తవ్వకాలు

సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు - ట్రక్కు రూ.500 నుంచి రూ.700 వరకు విక్రయాలు



ప్రజాశక్తి-బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండ మండలంలో అక్రమ మట్టి త్రవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలాల్లో అడ్డుఅదుపు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతూ దళారులు లక్షల రూపాయాలు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం వారి వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ట్రక్కు సుమారు రూ.500 నుండి రూ.700 వరకు విక్రయాలు జరిపి దళారులు జేబులు నింపుకుంటున్నారు. నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో ఈ విక్రయాలు మూడుపువులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. దీనికి కారణం విఆర్వోలు స్థానికంగా నివాసం ఉండక పోవటమేనని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులను స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకుని, దళారుల ఆట కట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



విద్యార్థులు ఏర్పాటు చేసిన రంగవల్లులు

గీతమ్స్‌లో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని గీతమ్స్ పాఠశాల్లో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగులతో ప్రత్యేక రంగవల్లులు ఏర్పాటు చేశారు. 2018 నూతన సంవత్సరం అందరికి శు భాలనను కలుగచేయాలని పాఠశాల కరస్పాండెంట్ ఎం.కోటిరెడ్డి ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

రేపటి నుంచి ఐదోవిడత జన్మభూమి-మాఊరు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

5వవిడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం ఈనెల 2వతేదీ నుంచి 11వతేదీ వరకు పట్టణంలోని 30వార్డులలో ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజానీకం ఆయా వార్డుల్లో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ విడత జన్మభూమి మాఊరు కార్యక్రమంలో సమాజ వికాసంకు సంబంధించి పది అంశాలలోని కుటుంబవికాశంకు సంబంధించి 15 అంశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈదిగువ తెలిపిన షెడ్యూలు ప్రకారం జరుగుతాయని ఆయన ఆప్రకటనలో పేర్కొన్నారు.

షెడ్యూల్ విడుదల

ఫిరంగిపురం : ఫిరంగిపురం మండలంలో ఐదో విడత జన్మభూమి-మా వూరు కార్యక్రమాలు జనవరి 2 తేదీ నుంచి 10 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బి.శ్యామలాదేవీ తెలిపారు. 2వ తేదీన గొల్లపాలెం, హౌస్‌గణేష్‌పాడు, రేపూడి, 3న శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, 4న ఫిరంగిపురం, అమీనాబాద్, 5న మునగపాడు, పొనుగుపాడు, 6న మేరికపూడి, నుదురుపాడు, 8న ఎర్రగుంట్లపాడు, 113 తాళ్లూరు, 9న గుండాలపాడు, బేతపూడి, 10న వేమవరం, కండ్రిక గ్రామాల్లో నిర్వహించారు. ఉదయం 10 : 30నుంచి సాయంత్రం 5 గంటల వరకు జన్మభూమి కార్యక్రమాలు ఉంటాయని ఆమె వెల్లడించారు.

ప్రముఖ చిత్రకారుడు జింకా రామారావుకు సన్మానం

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

ప్రముఖ చిత్రకారుడు, గీతాంజలి అనువాద చిత్రాంజలి ఘటించిన ఏకైక రూపశిల్పి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో దారావాహిణి 'జీవనసఫల్టా' చిత్ర జాతీయ పురస్కార గ్రహీత జింకా రామారావును సన్మానించారు. మహానటి సావిత్రి అవార్డు ప్రధాన కార్యక్రమం కంఠమనేని వెంకటసాంబశివరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జింకా రామారావు చిత్ర లేఖనాలను వర్ణించి కొనియాడారు. జింకా రామారావుకు అవార్డును అందజేసి శాలువాలతో సన్మానించారు. సభకు మంచికంటి వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పత్రి మెమోరియల్ , ఘంటసాల కళానిలయం అధ్యక్షులు గంగారపు వెంకట్రావు, చాంద్‌బాష, స్థానిక కళాకారులు మాతంగి సాంబశిరావు, సి.శివారెడ్డి, ఆంటోని, ఆర్.పురుషోత్తం, జానకిరామారావు, యిర్మీయ, కె.శ్రీనివాసరావు, శ్రీనివాస్, రాంబాబు, రత్నరాజు, లక్ష్మయ్య, పాల్గొన్నారు.



రామారావును సన్మానిస్తున్న సంస్థ నిర్వహకులు

ముస్తాబైన దుకాణాలు



కేక్ స్టాల్స్ వద్ద ప్రజలు

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలో నూతన సంవత్సర వేడుకలకు వ్యాపార కూడళ్లన్నీ అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. మిఠాయి దుకాణాలు, అలంకరణ సామాగ్రి షాపులు వద్ద ప్రజలు కిక్కిరిసిపోయారు. కేక్‌ల సంస్కృతి పల్లెల ద్వాకా వ్యాపించడంతో కేకుల అమ్మకం పలు కూడళ్లలో వెలిశాయి. వేల సంఖ్యలో విక్రయాలకు సిద్ధమయ్యాయి. మాచర్ల పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువగా కేక్ కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలు అంటే ఇంట్లో కేక్ కట్ చేసి వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. ఈమధ్యకాలంలో కేకులు వేడుక ప్రధాన కార్యక్రమంగా భావిస్తున్నారు. పెళ్లి, పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకల్లో ముఖ్యంగా కేకుల సాంప్రదాయం పెరిగింది.

ప్రముఖ న్యాయవాది సుబ్బారావు మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రముఖ న్యాయవాది, నోటరీ, ఘంటసాల కళా నిలయం కార్యదర్శి బూసి సుబ్బారావు గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. సుబ్బారావు రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ ప్రముఖులు, బంధువులు, మిత్రులు సుబ్బారావు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారావు పేదలకు ఉచితంగా న్యాయసహాయం చేస్తూ, సలహాలు ఇస్తూ పేదలకు, తెలిసిన వారికి ఉచితంగా నోటరీ చేస్తుండేవారని తెలిపారు. ఆయన మరణం ఘంటసాల కళానిలయంకు తీరనిలోటన్నారు. ఆయనను సందర్శించిన వారిలో ఘంటసాల కళానిలయం కార్యవర్గం వివి హరినాథ్, బత్తినేని వెంకట లక్ష్మయ్య, కంభాల శ్రీనివాస్, జొన్నలగడ్డ రత్నరాజు, అంజలీ కోటేశ్వరరావు, చిరంజీవి, బెజగం రవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు, న్యాయవాదులు దుగ్గినేని బాపయ్య చౌదరి, గంగూరి అజయ్‌కుమార్, బిఎల్ చెన్నయ్య, పూజల చిన వెంకట కోటయ్య, ఇ ఎల్లారెడ్డి, కళ్లం వీర భాస్కరరెడ్డి సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న ప్రముఖులు, సుబ్బారావు ఫైల్ ఫొటో (ఇన్‌సెట్)



పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వినియోగదారుల సంఘం

పండ్లు, రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి - దుర్గి

వినియోగదారుల హక్కుల రక్షణ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సర్పంచ్‌ల జిల్లా సంఘం అధ్యక్షులు వి.కోటానాయక్, వినియోగదారుల సంఘం మండల అధ్యక్షులు గందె ఏడుకొండలు అన్నారు. స్థానిక జెఎంజె ఆశ్రయంలో జాతీయ హక్కుల వినియో గదారుల దినోత్సం పురస్కరించుకుని వృద్ధులకు విని యోగదారుల సంఘం ఆధ్వర్యంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఓలు వీరయ్య, హరి ప్రసాద్, బుడగ జంగాల నాయకులు పెద్దిరాజు, షేక్ వలి ఉన్నారు.

అచ్చంపేట కాపునాడు అధ్యక్షునిగా మల్లిశెట్టి

ప్రజాశక్తి-అచ్చంపేట

స్థానిక మండల కాపునాడు అధ్యక్షునిగా మల్లిశెట్టి నాగేశ్వరరావును నియమించారు. ఈసందర్భంగా నాగేశ్వర రావు ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈబాధ్యతను అప్పగించిన గుంటూరు జిల్లా కాపునాడు అధ్యక్షులు బత్తుల ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కాపునాడు అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి శైలజా

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకుమాను

ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ముందస్తు నూతన సంవత్సరం వేడుకలను మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఎంపిపి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సర్వీసుల విషయాలు సెలవు నిబంధనలు అధికారుల సమాచారం తదితర విషయాలతో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లు ఎంతో ఆకర్షిణీయంగా రూపొందిస్తున్నారని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమాంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సెలర్ గేరా మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు, పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆగస్టీన్‌బాబు, ఎస్టీయూ మండల అధ్యక్షులు ఎల్.వీరాంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-అచ్చంపేట

ఏబిసిడి వర్గీకరణ కోరుతూ చేస్తున్న ఉద్యమంలో భాగంగా సోమవారం నుంచి 5వతేదీ వరకు మండల పరిధిలోని అన్ని పంచాయతీల వద్ద రిలే నిరాహరదీక్షలు చేపడుతున్నట్లు ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు సందిపోగు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ పిలుపుమేరకు రిలే నిరాహరదీక్షలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తుడుం రమేష్, నగేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకాగ్రత లోపంతోనే ప్రమాదాలు

ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీహరి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో అన్ని డిపోల నుండి వచ్చిన చివరి బ్యాచ్ డ్రైవర్లు 132మందికి రెండు బ్యాచ్‌లుగా విభజించి ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం శ్రీహరి మాట్లాడుతూ సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత లోపించి, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్ డ్యూటీ ఎక్కే సమయంలో భద్రతా సూక్తి పాటించాలని, ప్రయాణికుల ప్రాణాలు తన చేతిలో ఉన్నాయని గ్రహించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాల్సిన బాధ్యత తనపై ఉందని గుర్తుంచుకోవాలన్నారు. డ్రైవర్లు బస్సును నడిపే సమయంలో ఏ విధంగా జాగ్రత్తలు పాటిస్తే ఇంధన పొదుపు అవుతుందో, భద్రతా నినాదాలు ఇంధన పొదుపు సూత్రాలు తెలిపారు. ఇంధన పొదుకు కేవలం డ్రైవర్లపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఇంధన పొదుపు పెంచుకుంటే సంస్థపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. బస్సును నడిపే సమయంలోడ్రైవర్లు ఏకాగ్రత, సమయస్ఫూర్తి, వేగనియంత్రణ, వాహన శక్తిని గ్రహించినప్పుడే ఇంధన పొదుపు, యాక్సిడెంట్‌ల నియంత్రణ ఉంటుందన్నారు. శిక్షణలో గుంటూరు-2, నర్సరావుపేట, పిడుగురాళ్ల డిపో గ్యారేజి ఇన్‌ఛార్జిలు బి.కోటేశ్వరరావు నాయక్, బిఎ నాయక్, నరశింహ నాయక్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌ఎం శ్రీహరి

అన్ని విభాగాల్లో గుంటూరు ముందంజ

గుంటూరు రీజియన్ అన్ని విభాగాల్లో ముందంజలో ఉందని ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయం సమకూర్చటంలో, ఇంధన వినియోగంలో, ప్రయాణికులకు చేరువగా ఆర్టీసి సేవలను అందించటంలో ముందంజలో ఉందన్నారు. మార్కెటింగ్ పథకాల్లో, ఉచిత బస్ పాస్‌లు, తక్కువ ఛార్జీలతో లింక్ టికెట్ విధానం, గుంటూరు ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఎసి సౌకర్యం, అన్ని మండల స్థాయి గ్రామాల్లో ఆర్‌టిసి అధీకృత ఏజెంట్లను ఏర్పాటు చేయడం, రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం, తదితర అంశాల్లో గుంటూరు ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చుకుంటే గుంటూరులో అత్యధికంగా 603 తెలుగు వెలుగు బస్సులు నడుపుతున్నందన నష్టాలు వస్తున్నా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గతేడాది కంటే రూ.35కోట్ల నష్టాలు తగ్గించటంలో, ఇంధన వినియోగంలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని తెలిపారు. గుంటూరులో సిటీ సర్వీసులు నడుపుతున్నామని, కొత్తగా ప్రవేశపెట్టిన కార్గో సర్వీసుల్ని వినియోగదారులకు చేరువగా తీసుకెళ్లటంలో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉన్నామని తెలిపారు. జిల్లాలో 13 డిపోల పరిధిలో రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించుట గురించి సంబంధిత అధికారులకు లేఖలు రాశామన్నారు. సిబ్బంది డ్యూటీ విషయలో జరిగిన చిన్న చిన్న తప్పుల విషయంలో చొరవ చూపి 3వేల కేసులు ఎత్తివేస్తున్నట్లు వెల్లడించారు. సిబ్బంది సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని వివరించారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బండి శ్రీనివాసరావు, అసోసియేషన్ నాయకులు

ఏపి టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా యూనిట్ నూతన సంవత్సర క్యాలెండర్‌ని అదివారం ఆవిష్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ప్రశాంతి, కోశాధికారి జి.రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షులు కె.హరనాధ్, సభ్యులు నాగభూషణం, రవికుమార్ పాల్గొన్నారు.


శివకుమార్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివకుమార్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షులు మొగిలి శివకుమార్ సంస్మరణ సభ స్థానిక కొండా వెంకటప్పయ్య కాలనీలోని ఆయన నివాసం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మక్కెన మల్లిఖార్జునరావు, తదితర కాంగ్రెస్ నాయకులు శివకుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, ఎస్టీ విభాగం అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు శివకుమార్ చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. శివకుమార్ ఆకస్మిక మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మక్కెన మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. శివకుమార్ కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లా పార్టీ నాయకుల సహకారంతో శివకుమార్ కుటుంబానికి ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెలేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, పిసిసి ప్రధాన కార్యదర్శి పక్కాల సూరిబాబు, కార్యదర్శులు ఈరి రాజశేఖర్, జంజనం వేదాద్రి, సవరం రోహిత్ పాల్గొన్నారు.

హోంగార్డు పిట్టు సాంబశివారెడ్డికి నివాళి

కర్లపాలెం : మండలంలోని దిండువారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు సాంబశివారెడ్డి చందోలు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. బాపట్ల నుంచి కర్లపాలెం ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో డివైడర్‌ను ఢీకొట్టి అక్కడిక్కడే చనిపోయాడు. ఆదివారం ఆయన అంత్యక్రియలు దిండువారిపాలెంలో ఆయన స్వగృహం నందు జరిగాయి. డిఎస్‌పి గంగాధర్, ఎస్‌ఐ అశోక్‌బాబు, చందోలు ఎస్‌ఐ చెన్నకేశవులు మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. పిట్టు సాంబశివారెడ్డి(30)కి ఇంకా వివాహం కాలేదు. అమ్మ, అక్క ఉన్నారు. నాన్న మృతి చెందారు. సాంబశివారెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కార్పొరేషన్

ప్రతి ఒక్కరూ సేవ దృక్పథాన్ని కలిగి ఉండాలని టిడిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దాళి గిరిధర్ తెలిపారు. ఆదివారం స్థానిక సంపత్ నగర్ శ్రీరామనామ క్షేత్రంలో గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, సేవాదళ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పేద మహిళలకు ఆర్థిక స్వాలంభనకు తోడ్పాటుగా కట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న గిరిధర్ మాట్లాడుతూ సేవా కారక్రమాలను విస్తృతం చేయాలన్నారు. ఆర్యవైశు ్యలు మెడికల్ క్యాంప్‌లు, ఉచితంగా మందుల పంపిణీ, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆతుకూరి ఆంజనేయులు, పడుచూరి వెంకటేశ్వర్లు, పెను గొండ సబ్బారాయుడు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, మిట్టపల్లి కోటేశ్వరరావు, సాధు శివశంకరరావు పాల్గొన్నారు.


కుట్టు మిషన్‌ని అందిస్తున్న మద్దాలి గిరిధర్, తదితరులు

బిసి టీచర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కార్పొరేషన్ : బిసి టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ని ఆదివారం ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ ఆనందంగా ఉండాలని అకాంక్షించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు సమస్యలపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చంద్రశేఖరరావు, ఎన్.హరగోపాల్, కోశాధికారి షేక్ అక్బర్ పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, సంఘ నాయకులు

దీర్ఘకాలిక వ్యాధులకు ఫిజియోథెరపితో పరిష్కారం

వైద్యులు నాగసతీష్

ప్రజాశక్తి-కార్పొరేషన్

దీర్ఘకాలిక వ్యాధులకు ఫిజియోథెరపి విధానం ద్వారా పరిష్కారం ఉంటుందని సీనియర్ ఫిజియోథెరపి వైద్యులు డాక్టర్ నాగసతీష్ తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో జన్యుపరమైన లోపాలు, కాన్పుల సమయంలో ఇబ్బందుల వల్ల వచ్చే ఎదుగుదల సమస్యలను, వృద్ధాప్యంలో వచ్చే కీళ్ళు, నరాలు, కండరాలకు సంబంధించిన అనేక రుగ్మతలకు అధునాతన పద్ధతుల ద్వార పిజియోథెరపి వైద్యం అందుబాటులో ఉందన్నారు. దీర్ఘకాంగా ఉన్న నడుం, మెడ నొప్పి, కాళ్లు జాలు, తిమ్మిరులు వంటి సమస్యలకు కంప్రెషన్ ట్రాక్షన్ విధానం ద్వారా సర్జరీ అవరసం లేకుండా ఫిజియోథెరపి పరిష్కారం చూపుతుందన్నారు. గర్భిణులు చేయాల్సిన ప్రీ, పోస్ట్‌నాటల్ వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అచ్యుత ఇందుశేఖర్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగసతీష్

కర్లపాలెంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ప్రజాశక్తి-కర్లపాలెం

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కర్లపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ టి.అశోక్‌బాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై ధ్వనిచేస్తూ వేగంగా వెళ్లరాదని, గ్రూపులు గ్రూపులుగా చర్చలు పెట్టరాదని తెలిపారు.

ఆటో టైర్లు చోరీ

ప్రజాశక్తి-కర్లపాలెం

మండలం లోని నల్లమోతు వారిపాలెం సమీపంలో గోడౌన్స్ దగ్గర ప్రమాదానికి గురైన ఆటో పది రోజులుగా రోడ్డు పక్కనే నిలిపింది. ఆటోను ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఆటోటైర్లు చోరీ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన ఆటో

పేదలకు చేయూతే జననేస్తం లక్ష్యం

ప్రజాశక్తి-కర్లపాలెం

పేద విద్యార్థులకు చేయూతివ్వటమే జననేస్తం లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకులు పిట్లు మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని చింతాయపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో జననేస్తం సంస్థను ఆయన ప్రారంభించారు. తన తండ్రి పి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఈ సంస్థను ఏర్పాటేచేసి తొమ్మిది మంది పేద విద్యార్థులకు విద్యలో, ఆటలలో రాణిస్తున్న వారికి చేయూతనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పిఇటి గోపి, కన్వీనర్ కె.మహీంద్రారెడ్డి, పి.నారాయణ పాల్గొన్నారు.


సరస్వతీ విగ్రహానికి పూలమాలేస్తున్న మల్లిఖార్జునరెడ్డి

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నన్నపనేని రాజకుమారి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కొత్తపేటలోని డిఎస్ కళ్యాణమండపంలో వాసవి వనిత జాగృతి క్లబ్ అధ్యక్షురాలు కొప్పురావూరి రజని ఆధ్వర్యంలో నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా మిస్ దేవసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మున్సిపల్‌కమిషనర్ చల్లా అనురాధ, విజిలెన్స్ ఎస్‌పి టి.శోభామంజరి, మాజీ జడ్‌పి చైర్‌పర్సన్ కూచిపూడి విజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, మహిళల్లో చైతన్యం పెంపొందించి తద్వారా సమాజ సేవ చేయాలని, వాసవి వనిత జాగృతి క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. చల్లా అనురాధ మాట్లాడుతూ పురుషులతో సమానంగా, ప్రతి రంగంలో దీటుగా ఎదుగుతున్న ధీశాలి నేటి వనిత అని కొనియాడారు. నగర పరిశుభ్రత, అభివృద్ధికి మహిళలంతా కృషి చేయాలని చెప్పారు. అధ్యక్షురాలు కె.రజని మాట్లాడుతూ సేవా సంస్థ ద్వారా ఎంతో మంది పేదలు, అబలలకు చేయూతనిచ్చి, వారిని సమాజంలో గౌరవంగా జీవించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డి.సుజాత, రమాదేవి, షర్మిల, కళ్యాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



డిడిని అందిస్తున్న మోహన్, డిఎస్‌పి సరిత

చిన్నారి వైద్యానికి మాస్టర్ మైండ్స్ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-కార్పొరేషన్

విద్యతో పాటుగా మానవతా విలువలకు ప్రాధాన్యతనిస్తూ దాన్ని మాటలకే కాకుండా చేతలలో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు చూపారని సంస్థ డైరెక్టర్ మట్టు పల్లి మోహన్ తెలిపారు. జన్మించిన 20 రోజుల్లోనే అరుదైన గుండె సమస్యతో బాధపడుతున్న చిన్నారికి మాస్టర్ మైండ్స్ సిఎ విద్యార్థులు అందిచిన రూ.1,85,731 డిడిని డిఎస్‌పి సరితతో కలిసి మోహన్ చిన్నారి తండ్రి ఫయాజ్ అహ్మద్‌కు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ చిన్నారికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకొని తమ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారన్నారు. చిన్నారికి విరాళాలు అందించే వారు 88864 99387 నంబర్‌ని సంప్రదించాలని కోరారు. చిన్నారి తండ్రి సాయం అందించిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవగాహన సంస్థలో ముందస్తు వేడుకలు

కార్పొరేషన్ : స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థలో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సభ్యులు వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 'అందరూ బాగుండాలి అందులో మనముండాలి' అనే నినాదాన్ని సభ్యులు నినదించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ 2018 సంవత్సరం గుంటూరు జిల్లా ప్రజలలో సామాజిక స్పృహ, సేవానిరతి పెరగాలని ఆశించారు. ప్రతి ఒక్కరూ సేవభావంతో తోటి వారికి తోడ్పడాలని, స్వచ్ఛ గుంటూరుకు నగరవాసులు ఐక్యంగా సహకరించాలని కోరారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశిధర్

ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలి

ఎపిఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ కోన శశిధర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పనిచేసే ఉద్యోగులంతా నూతన సంవత్సరంలో సంతోషంగా గడపాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ అన్నారు. ఎపిఎన్‌జిఒ క్యాలెండర్-2018ను ఆదివారం కలెక్టర్ తన బంగ్లాలో ఆవిష్కరించారు. ఉద్యోగులు ఆహ్లాదంగా గడిపేందుకు త్వరలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో ఉద్యోగులంతా అంకిత భావంతో పనిచేసి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చాలని కోరారు. జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు షేక్ బాజీత్ మాట్లాడుతూ కలెక్టర్ మార్గదర్శకత్వంలో గ్రామస్థాయి వరకూ చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.రాంబాబు, కోశాధికారి జి.శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు కెఎన్ సుకుమార్, ఎంఎస్ మూర్తి, జిల్లా సహాధ్యక్షులు ఎస్‌డి జానీబాషా, ఉపాధ్యక్షులు జిఎస్ రాజకుమార్, బి.వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వై.షేక్

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ వైద్యశిబిరం

కార్పొరేషన్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నల్లచెరువు కమ్యూనిస్టుల బొమ్మల సెంటర్‌లో వైద్యశిబిరం నిర్వహించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వై.షేక్ తెలిపారు. ఫౌండేషన్ తరుపున రూ.3000 విలువైన సంపూర్ణ శరీర పరీక్షలు రూ.750 కే చేస్తున్నామన్నారు. ఎంతో ఖరీదైన పరీక్షలు కూడా ఇందులో నామమాత్రపు రుసుంకే చేస్తున్నామన్నారు. ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, ఇసిజి, ముఖ్య అవయవాల పనితీరు తెలిపే పరికరాలు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫైడ్ ల్యాబ్‌లో చేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్యాకేజీలో పరీక్షలు చేయించుకున్న వారికి స్థానిక నేషనల్ హాస్పిటల్‌లో ఒక సంవత్సరం పాటు ఉచితంగా ఓపి చూస్తారన్నారు. వివరాలకు 94402 14706 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



పాటలు పాడుతున్న చిన్నారులు

విద్యార్థులకు దేశభక్తి పోటీలు

ప్రజాశక్తి-కార్పొరేషన్

స్థానిక బృందావన గార్డెన్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అంశంపై విద్యార్థులకు దేశభక్తి పాటల గానం, బుర్రకథ పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇండ్ల శ్రీధర్‌బాబు, కోట శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. విజేతలకు జనవరి రెండో వారంలో ప్రత్యేక అభినందన సభలో బహుమతులు అందిస్తామని తెలిపారు.

దుప్పట్లు, బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-కార్పొరేషన్

సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సమాజ సేవ చేయాలని జిల్లా జైలర్ కాటూరి జవహర్ బాబు తెలిపారు. దీక్షిత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట ప్యాన్సీ మర్చంట్స్ కళ్యాణ మండపంలో పేదలకు ఆర్థిక సాయం, దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జైలర్ మాట్లాడుతూ పేదలకు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు యడ్లపల్లి శ్రీకృష్ణ, ఉషశ్రీలు మాట్లాడుతూ తమకు అవకాశం ఉన్న మేరకు చిన్నారులకు యూనిఫామ్ వంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. తమకు మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జైలర్ సిహెచ్.వేణు, అమరావతి అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జైలర్ జవహర్‌బాబు

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అర్బన్ ఎస్‌పి విజయరావు

ప్రజాశక్తి-గుంటూరు



నూతన సంవత్సరం 2018ని పురస్కరించుకొని పోలీసు సిబ్బంది, ప్రజలకు అర్బన్ జిల్లా ఎస్‌పి సిహెచ్ విజయరావు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని, అన్ని రంగాల్లో ప్రజలు అభివృద్ధి సాధించాలన్నారు. యువత రెట్టింపు ఉత్సాహంతోవారి భావి జీవితాన్ని ప్రణాళికా బద్ధంగా, పట్టుదలతో తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. పోలీసు సిబ్బంది నూతన సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు మరింత చేరువ కావాలని, మెరుగైన సేవలతో పోలీసు శాఖకు మంచి పేరు తేవాలని సూచించారు.

చలమయ్య కళాశాల విద్యార్థుల రక్తదానం

కార్పొరేషన్ : ఇటీవల ఫిరంగిపురం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు నగరంలోని ఒక ప్రయివేటు హాస్పిటల్‌లో వైద్యం పొందుతున్న విద్యార్థినులకు చలమయ్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారని కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభ తెలిపారు. ఆదివారం రక్తదానం చేసిన విద్యార్థులు వెంకటేష్, మస్తాన్ షరీఫ్, కృపాకుమార్, రామకృష్ణ, అబ్బాస్, అనుదీప్‌లను కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సహాయం అందించడం విద్యార్థులు అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎ.శ్రీధర్, అధ్యాపకులు రాజరాజేశ్వరి, చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, అంకమ్మరావు పాల్గొన్నారు.


రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కారంపూడికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్

పిడుగురాళ్లలో ముగిసిన కెజిబివి జిల్లాస్థాయి క్రీడలు


ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న కారంపూడి విద్యార్థినులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల పట్టణంలోని మన్నె పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన కస్తూరిభా గాంధీ విద్యాలయ(కెజిబివి) జిల్లా స్థాయి క్రీడ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌జెడి శ్రీనివాసులురెడ్డి, పట్టణ సిఐ ఎమ్.హనుమంతరావు, మున్సిపల్ చైర్మన్ భవనాశి హైమావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులను ఆయా క్రీడల్లో నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతోమంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారని వారిలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడోత్సావాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. సిఐ హనుమంతరావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమిపాలైన వారు బాధపడకుండా గెలిచి వారికి ప్రోత్సాహం అందించాలని, గెలిచే వరకూ పోరాడాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవనాశి హైమవతి మాట్లాడుతూ నేడు ప్రతి రంగంలోనూ మహిళలు మగవారికి దీటుగా పోటీ ఇస్తున్నారని క్రీడల్లో కూడా విద్యార్థినులు పైచేయి సాధించాలన్నారు. చిన్నతనం నుంచే పోటీల్లో పాల్గొని మనోధైర్యాన్ని పెంచుకోవాలని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగే విధంగా ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాలు పిడుగురాళ్లలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి ప్రాజెక్టు ఆఫీసర్ కె. వెంకటసత్యవతి అధ్యక్షత వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు అతిథులు బహుమతులు అందజేశారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కారంపూడి విద్యార్థినులు ఆర్‌జెడి శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

విజేతల వివరాలు

కబడ్డీలో కారంపూడి విద్యార్థినులు మొదటి బహుమతి సాధించగా, నర్సరావుపేట విద్యార్థినులు ద్వితీయస్థానంలో నిలిచారు.


సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఖోఖో : నూజెండ్ల విద్యార్థినులు మొదటి బహుమతి సాధించగా, కారంపూడి విద్యార్థినులు రెండోస్థానంలో నిలిచారు.

వాలీబాల్ : చిలకలూరిపేట విద్యార్థినులు మొదటి బహుమతి పొందగా, గురజాల విద్యార్థినులు రెండోస్థానంలో నిలిచారు.

టెన్నికాయిట్ : సింగిల్స్, డబుల్స్‌లో నూజెండ్ల, ముప్పాళ్ల విద్యార్థినులు వై.బ్రహ్మేశ్వరీ, భూలక్ష్మి, పుష్ప మొదటి బహుమతి సాధించగా, మాచవరం, నూజెండ్లకు చెందిన విద్యార్థినులు వై.జెస్సికా, జ్యోత్స్న, కె. అంకమ్మ ద్వితీయబహుమతి సాధించారు.

100 మీటర్లు పరుగు : రొంపిచర్లకు చెందిన ఎస్.జ్యోతి ప్రథమస్థానంలో నిలవగా, రెండోస్థానంలో నూజెండ్లకు చెందిన వెంకటరమణ నిలిచింది. మూడు, నాలుగు స్థానాల్లో రెంటచింతల, కారంపూడికు చెందిన గౌతమి, హేమలత దక్కించుకున్నారు.

200 మీటర్లు : నూజెండ్ల విద్యార్థిని వై.మల్లీశ్వరీ ప్రథమస్థానంలో నిలువగా, రెండు, మూడు స్థానాల్లో కారంపూడి, చిలకలూరిపేట విద్యార్థినులు టి.పావని, బి.కవిత సాధించారు.

800 మీటర్లు : రొంపిచర్ల మండలానికి చెందిన జి.మమత మొదటి బహుమతి పొందగా, కారంపూడి మండలానికి చెందిన బి.శిరీష రెండోస్థానంలో నిలిచింది. మూడు, నాలుగు స్థానాల్లో నూజెండ్ల, రెంటచింతల పాఠశాలలకు చెందిన ఎ.సత్య, నందిని కైవసం చేసుకున్నారు.

1500 మీటర్లు : కారంపూడికి చెందిన బి.శిరీష మొదటిస్థానంలో నిలువగా, రెండు, మూడుస్థానాల్లో రొంపిచర్ల, చిలకలూరిపేట పాఠశాలలకు చెందిన కె.నాగమల్లీశ్వరీ, జె.యశోదలు నిలిచారు.

లాంగ్‌జంప్‌లో : మాచవరం పాఠశాలకు చెందిన జి.శ్రీలత మొదటిస్థానం సాధించగా, రెండు, మూడు స్థానాల్లో దాచేపల్లి, బెల్లంకొండ పాఠశాలలకు చెందిన కె.పావని, ఎమ్.దీప్తి నిలిచారు.

షాట్‌పుట్ : మాచవరం పాఠశాలకు చెందిన జి.రమ్యకృష్ణ 8.1 మీటర్లు విసిరి ప్రథమస్థానంలో నిలిచింది. రెండోస్థానంలో బెల్లంకొండ మండలానికి చెందిన ఎమ్.దీప్తి 7.9 మీటర్లు విసిరింది. మూడు, నాలుగు స్థానాల్లో దాచేపల్లి, కారంపూడి పాఠశాలలకు చెందిన ఎన్.శిరీష, ఆర్.కళ్యాణిబాయి 7.1 మీటర్లు విసిరారు.

డిస్కస్‌త్రో: మాచర్ల పాఠశాలకు చెందిన అంజలి 22.23 మీటర్లు విసిరి మొదటిస్థానంలో నిలిచింది. బెల్లంకొండ పాఠశాలకు చెందిన ఎన్.గోపిక తులసి 15.8 మీటర్లు విసిరి రెండోస్థానంలో నిలిచింది. నూజెండ్ల, గురజాల పాఠశాలలకు చెందిన మల్లేశ్వరీ, మహేశ్వరీ 14.48 మీటర్లు విసిరి మూడోస్థానంలో నిలిచారు.


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

జావెలిన్‌త్రో : దాచేపల్లి పాఠశాలకు చెందిన ఎస్.సౌందర్య 17.34 మీటర్లు విసిరి మొదటిస్థానం సాధించింది. బెల్లంకొండ పాఠశాలకు చెందిన ఎ.కవితాబాయి 16 మీటర్లు విసిరి రెండోస్థానంలో నిలిచింది. రెంటచింతల, మాచర్ల పాఠశాలలకు చెందిన బి.కీర్తన 15.6 అలివేలు మంగమ్మ 15 మీటర్లు విసిరి వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు.

రోప్‌స్కిప్పింగ్ : కారంపూడికి చెందిన నరసమ్మ మొదటిస్థానంలో నిలువగా, రెండు, మూడు స్థానాల్లో రెంటచింతల, నాందెడ్ల పాఠశాలలకు చెందిన ఎస్‌కె.రజియాబాయి, ఎమ్.అమృత నిలిచారు.

బహుమతుల పంపిణీ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సభను ముగించారు.